ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 20 నవంబరు 2025





కొండ దిగువన పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కాంతులీనిన కొండ



అనంత పద్మనాభుని దీపోత్సవంలో భాగంగా మెట్ల మార్గంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దేదీప్యమానంగా పద్మనాభుని దీపోత్సవం

- పోటెత్తిన భక్తులు

పద్మనాభం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

అనంత పద్మనాభుని దీపోత్సవం బుధవారం సాయంత్రం కన్నులపండువగా జరిగింది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవానికి ఈ ఏడాది భక్తులు భారీగా తరలివచ్చారు. చలిని కూడా లెక్క చేయకుండా వేకువజామునే పద్మనాభం చేరుకుని మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకుంటూ గిరిని అధిరోహించారు. అక్కడ అనంత పద్మనాభుడిని దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువన కుంతీమాధవస్వామి, నారాయణేశ్వరస్వామి, మత్స్యమూర్తి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ ... మిగతా 6వ పేజీలో

రారెత్తిస్తున్న కూరగాయల ధరలు

రైతుబజార్లలో కిలో టమాటా రూ.42

- బెండ, దొండ అన్నీ కిలో రూ.60 పైనే
- కనిపించని వంకాయలు, మునక్కాయలు



విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైతుబజార్లలో కూరగాయల ధర లు మండిపోతున్నాయి. వర్షాలతో పంటలు పోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పది రోజుల క్రితం కిలో రూ.30కి లభించిన టమాటా ఇప్పుడు రూ.42కి విక్రయిస్తున్నారు. ఈ సరకు కూడా అవసరమైనంత అందుబాటులో లేదు. టామాటా దుకాణాల ముందు కొనుగోలుదారులు క్యూ కడుతున్నారు. వంకాయలు, మునక్కాయలు అయితే బజార్లలో కనిపించడం లేదు. ఆకుకూరలదీ అదే పరిస్థితి. బెండ కాయలు, దొండకాయలు కిలో రూ.60పైన అమ్ముతున్నారు. బీరకాయలు, కాకరకాయలు చిక్కుళ్లు, పెన్సిల్ బీన్స్ కూడా కిలో రూ.60 చొప్పున అమ్ముతున్నారు. దేముడు చిక్కుడైతే కిలో రూ.90. గిరిజన రైతులు తెచ్చే బీన్స్ పిక్కలు కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. ఇవన్నీ రైతుబజార్లలో ధరలు మాత్రమే. బయట ఇవే కూరగాయలను చిల్లర వర్తకులు కిలోకు అధమంగా రూ.20 నుంచి రూ.30 ఎక్కువ వేసుకొని విక్రయిస్తున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు కొనుగోలుదారులకు అవసరమైన కూరగాయలు రైతుబజార్లలో అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (టెక్నికల్)గా గౌతమ్ మార్వా

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):



తూర్పు నౌకాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (టెక్నికల్)గా రియర్ అడ్మిరల్ గౌతమ్ మార్వా బాధ్యతలు స్వీకరించారు. నేవీలో 1992లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఐఎన్ఎస్ గోమతి, ఐఎన్ఎస్ నిర్ఘాత్, ఐఎన్ఎస్ త్రిశూల్‌లలో విధులు నిర్వహించారు. తల్వార్ క్లాస్ శిక్షణ కోసం రష్యా, నైజీరియాల్లో డిఫెన్స్ అడ్వైజర్‌గా పనిచేశారు. ముంబై, విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులలో ఎక్కువ కాలం బాధ్యతలు నిర్వర్తించారు. ప్రభుత్వం ఆయన సేవలను మెచ్చి 2021లో విశిష్ట సేవా పతకంతో సత్కరించింది.

దుకాణం పేరిట దందా

సెంట్రల్‌పార్కు వద్ద స్మార్ట్ వెండింగ్ జోన్ ఏర్పాటుకు జీవీఎంసీ సన్నాహాలు

- గతంలో ఫుడ్‌కోర్టు ఉన్నచోటే...
- 120 దుకాణాల ఏర్పాటుకు కౌన్సిల్ అజెండాలో ప్రతిపాదన
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- అందులో దుకాణం ఇప్పిస్తామంటూ వసూళ్లు
- ఒక్కొక్కదానికి రూ.లక్ష...



సెంట్రల్‌పార్కు వద్ద స్మార్ట్ వెండింగ్‌జోన్ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫుడ్‌కోర్టు పేరుతో మరోసారి వసూళ్ల దందా మొదలైంది. వీఎంఆర్‌డీఏ సెంట్రల్‌పార్కు వద్ద నధికారికంగా ఏళ్ల తరబడి కొనసాగిన ఫుడ్‌కోర్టును జీవీఎంసీ అధికారులు కొద్దికాలం కిందట తొలగించారు. అక్కడ స్మార్ట్ వెండింగ్ జోన్ పేరుతో తిరిగి దుకాణాలను ఏర్పాటు చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. శుక్రవారం జరిగే కౌన్సిల్ సమావేశం అజెండాలో దీనిని చేర్చడంతో దళారులు రంగంలోకి దిగిపోయారు. వెండింగ్‌జోన్‌లో దుకాణం ఇప్పిస్తామంటూ ఒక రాజకీయ నేత పేరు చెప్పి దుకాణానికి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నారు. ఫుడ్‌కోర్టులో దుకాణం పోయినవారితోపాటు కొత్తవారు కూడా దుకాణం కోసం పోటీపడుతున్నారు.

నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను జీవీఎంసీ అధికారులు ఇటీవల తొలగించారు. అందులో భాగంగా వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు వద్ద జీవీఎంసీ అనుమతి లేకుండా కొనసాగుతున్న ఫుడ్‌కోర్టును కూడా తొలగించారు. దుకాణాలను తొలగించడం వల్ల రోడ్డునపడిన వారికి తిరిగి జీవనోపాధి కల్పించేందుకు నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ స్మార్ట్ వెండింగ్ జోన్‌లతోపాటు స్ట్రీట్ వెండింగ్ జోన్‌లను ఏర్పాటుచేస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రకటించారు. దీనికోసం అర్హులైన వీధి వ్యాపారులను గుర్తించేందుకు యూసీడీ అధికారులతో సర్వే చేయించారు. జీవీఎంసీలోని ఎనిమిది జోన్ల పరిధిలో సుమారు తొమ్మిది వేల మంది వరకు రోడ్డు పక్కన దుకాణాలే ప్రధాన జీవనాధారంగా జీవిస్తున్నారని సర్వేలో అధికారులు గుర్తించారు. వారందరికీ 98 వార్డుల పరిధిలో స్మార్ట్ వెండింగ్ జోన్‌లు, స్ట్రీట్ వెండింగ్‌జోన్‌లు ... మిగతా 6వ పేజీలో

ఉక్కు ఉద్యోగుల ఆందోళన

ఉత్పత్తి ఆధారిత వేతనంపై రీజనల్ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించిన కార్మిక సంఘాలు

- యాజమాన్యం ఉత్తర్వుల రద్దుకు డిమాండ్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఇకపై ఉత్పత్తి ఆధారంగా ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు ఇస్తామని ప్రకటించడంపై కార్మిక సంఘాలు న్యాయపోరాటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే రీజనల్ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించి చట్టానికి విరుద్ధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని, వెంటనే ఆ ఉత్తర్వుల రద్దుకు ఆదేశించాలని డిమాండ్ చేశాయి.

బకాయిలు అడిగితే...

స్టీల్ ప్లాంటు కార్మికులకు గత ఏడాదికాలంగా సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదు. 2024 సెప్టెంబరు నుంచి సగం జీతాలు మాత్రమే ఇవ్వడం ప్రారంభించింది. అప్పటివరకూ ఇంక్రిమెంట్లు, పదోన్నతులు కోరిన సంఘాలు.. వాటిని పక్కనపెట్టి నెలనెలా జీతాలు ఇస్తే చాలు అనే స్థితికి వచ్చాయి. ఆందోళనలు ఉధృతం చేయడంతో ఆ తరువాత 65 శాతం, 75 శాతం జీతాలు ఇచ్చారు. మళ్లీ ఈ ఏడాది సెప్టెంబరు నుంచి 100 శాతం ఇస్తున్నారు. కేవలం రెండు నెలలు ఇచ్చి ఇప్పుడు ఉత్పత్తి ఆధారంగా ఇస్తామని ... మిగతా 6వ పేజీలో

డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులు

- నేడు, రేపు ధర్నాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి ఆధారిత జీతాలపై యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను విరమించుకోవాలని, ఇంకా పలు డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించి ఉక్కు ఉద్యోగులు బుధవారం విధులకు హాజరయ్యారు. ఉత్పత్తితో వేతనాలను ముడిపెట్టవద్దని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనే డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించారు. యాజమాన్యం తీరుకు నిరసనగా గురువారం ప్లాంటు బీసీ గేటు ముందు, శుక్రవారం జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపడతామని ఉక్కు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ధర్నాలో భారీగా ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ



లబ్ధిదారులకు నమూనా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్


విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' పథకం రెండో విడత నిధులను రైతులకు బుధవారం పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి రైతు ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.ఐదు వేలు, కేంద్రం పీఎం కిసాన్ కింద రూ.రెండు వేల చొప్పున జమ చేశారు. ప్రతి రైతుకు రూ.ఏడు వేలు అందాయి. విశాఖ జిల్లాలో పీఎం కిసాన్ 16,769 మందికి, అన్నదాత సుఖీభవ 18,573 మందికి వర్తించింది. వీరికి సుమారు రూ.12.64 కోట్లు పంపిణీ చేశారు. భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా రూ.10.06 కోట్లు, పెందుర్తి రూ.2.2 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశారు. మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో అతి తక్కువ మంది రైతులు ఉన్నారు.

నియోజకవర్గం	పీఎం కిసాన్ లబ్ధిదారులు	జమ చేసిన సొమ్ము	అన్నదాత సుఖీభవ	జమ చేసిన సొమ్ము రూ.కోట్లలో
భీమిలి	12,856	2.57	14,981	7.49
గాజువాక	562	0.11	466	0.23
పెందుర్తి	3289	0.65	3126	1.56
విశాఖ పశ్చిమ	34	0.0068	0	0
విశాఖ తూర్పు	9	0.0018	0	0
విశాఖ ఉత్తర	19	0.0038	0	0
మొత్తం	16,769	3.35	18,573	9.28

రాంబిల్లిలో రిలయన్స్

సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్‌లు, ప్యాకేజింగ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమ ఏర్పాటు

- రూ.784 కోట్ల పెట్టుబడి
- 300 మందికి ఉద్యోగాలు
- 30 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం
- ఐదేళ్లలో రూ.330 కోట్ల రాయితీలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లాలో మరో పెద్ద పారిశ్రామిక సంస్థ పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసింది. దీని ద్వారా 300 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. ముఖేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) సంస్థ మూడేళ్ల క్రితం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌ను ఏర్పాటుచేసింది. రిటైల్ వెంచర్స్‌లో భాగమైన ఈ కంపెనీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టిసారించింది. అనకాపల్లి జిల్లాలో సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్‌లు, ప్యాకేజింగ్ డ్రింకింగ్ వాటర్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించింది. ఈ నెల మొదటి వారంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ కమిటీకి దరఖాస్తు చేయగా, మూడు రోజుల్లోనే దానిని పరిశీలించి పెట్టుబడుల ప్రమోషన్ బోర్డుకు సిఫారసు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రాంబిల్లి మండలంలోని కృష్ణంపాలెంలో 30 ఎకరాలను కేటాయించింది. ఎకరా రూ.40 లక్షలు చొప్పున ఇచ్చింది. ఈ పరిశ్రమపై రూ.784 కోట్లు వెచ్చించనున్నట్టు రిలయన్స్ గ్రూపు వెల్లడించింది. వీరికి రాష్ట్ర ప్రభుత్వం టైలర్ మేడ్ రాయితీలు ప్రకటించింది.

- పెట్టుబడి రాయితీ కింద రూ.25 కోట్లు ఇవ్వనున్నారు.
- రాష్ట్రానికి చెల్లించే జీఎస్‌టీని 100 శాతం రీఎంబర్స్‌మెంట్ చేసుకోవచ్చు. ఇలా ఐదేళ్ల జీఎస్‌టీ వెనక్కి వెళ్లిపోతుంది. దీని అంచనా విలువ రూ.249.82 కోట్లు.
- ఉపయోగించుకునే విద్యుత్‌కు యూనిట్‌కు రూపాయి చొప్పున ఐదేళ్ల రాయితీ ఇస్తారు. దీని ద్వారా రూ.27.60 కోట్లు లబ్ధి చేకూరుతుంది.
- ఎలక్ట్రిసిటీ డ్యూటీ ... మిగతా 6వ పేజీలో

కనకమహాలక్ష్మి ఆలయంలో..

రేపటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్
- అన్నదానం, ప్రసాదాల తయారీపై దృష్టి
- ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీ చేయించాలని ఆదేశం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 19వ తేదీ వరకూ ఆలయం భక్తులతో రద్దీగా ఉంటుంది. గురువారాల్లో భక్తజనసందోహం తరలివస్తారు. దీనికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. స్వయంగా జిల్లా కలెక్టర్ సోమవారం ఆలయానికి వచ్చి పరిసరాలన్నీ తిరిగి పలు సూచనలు చేశారు. ఆలయంలోనే సమావేశం నిర్వహించి ఏ విభాగం ఏయే బాధ్యతలు తీసుకోవాలో ఆదేశించారు. భక్తులకు అన్ని వసతులు ఏర్పాటుచేయాలని, తోపులాటలు లేకుండా, అడ్డగోలు దర్శనాలు లేకుండా క్రమపద్ధతిలో అన్నీ నిర్వహించాలని ... మిగతా 6వ పేజీలో

తొట్లకొండపై

బౌద్ధ వివరణ కేంద్రంలో క్యాంటీన్

- మత వివరాలు తెలియజేసేందుకు ఎనిమిదేళ్ల క్రితం ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ ఏర్పాటు
- అప్పటినుంచి ప్రారంభించని అధికారులు
- తాజాగా అందులో క్యాంటీన్ ఏర్పాటుకు నిర్ణయం
- పురావస్తు స్థలాల పరిరక్షకుల అభ్యంతరం

బౌద్ధ వివరణ కేంద్రం



విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తొట్లకొండపై ఎనిమిదేళ్ల క్రితం బౌద్ధమత వివరణ/ప్రచారం కోసం నిర్మించిన కేంద్రం (ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్)లో తాజాగా క్యాంటీన్ ఏర్పాటుచేయాలని నిర్ణయించడం వివాదాస్పదమవుతోంది. పర్యాటకులకు బౌద్ధమత విశేషాలను వివరించేందుకు ఏర్పాటుచేసిన సెంటర్‌లో క్యాంటీన్ ఏర్పాటుచేయడంపై పురావస్తు స్థలాలను రక్షించే ఉద్యమకారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. క్రీ.పూ. మూడో శతాబ్దానికి చెందిన తొట్లకొండపై బౌద్ధ మతానికి చెందిన అనేక కట్టడాలు ఉన్నాయి. వాటిని సందర్శించేందుకు దేశవిదేశాల నుంచి బౌద్ధమతానికి చెందిన సన్యాసులు, పరిశోధకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో తొట్లకొండ విశిష్టతను వివరించడానికి వీలుగా ఒక సెంటర్ నిర్మాణం, శిథిలమైన కట్టడాల మరమ్మతులకు 2014లో ... మిగతా 6వ పేజీలో

ఏయూలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై ఆరా

- వివరాలు అడిగిన ఉన్నత విద్యా మండలి

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై ఉన్నత విద్యా మండలి ఆరా తీసినట్టు తెలిసింది. ఈ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో 'ఆంధ్రజ్యోతి' సోమవారం కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో వర్సిటీ అధికారులను ఉన్నత విద్యా మండలి అధికారులు వివరాలు అడిగినట్టు తెలిసింది. అలాగే విజిలెన్స్, ఇంటెలిజెన్స్ అధికారులు వర్సిటీకి వచ్చి సమాచారాన్ని తెలుసుకున్నట్టు తెలిసింది. దీనిపై వర్సిటీ అధికారులు ఇప్పటివరకూ అధికారికంగా ఎటువంటి ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. ఇదిలావుండగా బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వ్యవహారంలో అక్రమాలు జరిగాయంటూ పలువురు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మరికొందరు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.అసలు నియామక ప్రక్రియను ఎలా నిర్వహించారన్న విషయాన్ని వెల్లడించాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.


భక్తులు దీపాలు వెలిగించనున్న స్వామివారి వరాహపుష్కరిణి

పోలిపాడ్యమి దీపారాధనకు సన్నాహాలు

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం కొండదిగువన ఉన్న వరాహ పుష్కరిణిలో శుక్రవారం జరిగే పోలిపాడ్యమి దీపారాధనకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిట్టుగా పుష్కరిణిలో జాలీలు (కంచె), గట్టుపై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణికి చేరుకునే మార్గంలో దేవస్థానానికి చెందిన కమ్యూనిటీ గార్డులు, గోపాలపట్నం పోలీసుల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళలు, పిల్లలు, దీపాలు వదిలే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మధురవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని స్వతంత్రనగర్ కాలనీలో ఉన్న సాయి లింగేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లకు అన్నాభిషేకం చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.


పూల అలంకరణలో శివ పార్వతులు

పరస్పర సహకారంతో పంటల సాగు


కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ కిశోర్‌కుమార్

భీమునిపట్నం (రూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో భూసారం పెంచడం, వ్యవసాయ ఖర్చులు తగ్గించడం వంటి కార్యక్రమాల కోసమే కర్షక దేవోభవ మిషన్ పని చేస్తుందని ఆ మిషన్ చైర్మన్ డా. ఎ. కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం మజ్జిపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక రైతు పొలంలో పని జరుగుతున్నప్పుడు పక్కనున్న రైతులు సహాయం చేయడాన్ని రైతు సమ్మి పద్ధతి అంటారని, దీనివల్ల సాగు ఖర్చు తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మోహనరావు, ప్రకాశరావు, డ్రిప్ ఇరిగేషన్ జిల్లా అధికారి మన్మథరావు, ఏఓ శ్యామల, భాను పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జోడుగుళ్లపాలెం తీరంలో ఉన్న కొత్త అమ్మవారు ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను వెలగపూడి ప్రతాప్ ప్రారంభించారు.

'వర్తకులకు ఇబ్బందులు ఉండవు'

మధురవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలో నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి వల్ల వర్తకులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని జీవీఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సూచన మేరకు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కూటమి నాయకులు మధురవాడ కూడలి, మిథిలాపురి వుడాకాలనీ, పిలకవానిపాలెం ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మధురవాడ మార్కెట్ నుంచి పీహెచ్‌సీ వరకు ఉన్న వ్యాపారులు అధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల దుకాణాలు తొలగించాల్సి ఉన్నందున తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి నష్టం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-2 డీఈ మణికుమార్, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ నవీన్, ఏఈ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజుపేటలో దీపోత్సవం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణంరాజుపేట రామాలయంలో బుధవారం సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో మహిళలు తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సామూహికంగా దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం, డోకరపేట తదితర గ్రామాలకు మహిళలు కూడా పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో తాగునీటి సమస్య

సాగర్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ పరిసర ప్రాంతాలకు రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రాంతానికి టీసీఆర్ కాంప్లెక్స్ నుంచి హనుమంతువాక మీదుగా ఉన్న పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. హనుమంతువాక కూడలి వద్ద సాగర్‌నగర్ వైపు వచ్చే పైపులైన్‌కు ఉన్న వాల్వ్ మరమ్మతుకు గురవ్వడంతో నీటి సరఫరా నిలిచిపోయింది.సంబంధిత సిబ్బంది శరవేగగా మరమ్మతులు చేపడుతున్నారు.గురువారం ఉదయం నుంచి నీటి సరఫరా జరిగే అవకాశం అధికారులు తెలిపారు.

బౌద్ధ వివరణ కేంద్రంలో క్యాంటీన్!

... 5వ పేజీ తరువాయి

అప్పటి పాలకులు రూ.1.8 కోట్లు మంజూరుచేశారు. ఆ సెంటర్‌లో ప్రొజెక్టర్ ద్వారా బౌద్ధమత విశిష్టతను తెలియజేసే డాక్యుమెంటరీ ప్రదర్శన, లైబ్రరీ, ఇతర వసతులు, హాలు, మరుగుదొడ్లు, సమాచారం అందించే డెస్క్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ భవన నిర్మాణం 2016-17లో పూర్తిచేశారు. ఇంతవరకూ భవనం ప్రారంభించాలనే విషయాన్ని పురావస్తుశాఖ అధికారులు మరిచిపోయారు. కొండపైకి వచ్చే వారికి కనీసం తాగునీటి సదుపాయం కూడా లేదు. ఈ ఏడాది మే నెలలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ జైన్ తొట్లకొండను సందర్శించి అక్కడ వసతులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కొండపై కొత్తగా నిర్మించిన భవనం ఎందుకు వినియోగించలేదని అధికారులను నిలదీశారు. చివరకు ఆయన జోక్యంతో వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి తొలుత భవనానికి చిన్న చిన్న మరమ్మతులు చేశారు. అనంతరం అజయజైన్ సూచన మేరకు కొండపైకి వచ్చేవారికి మంచినీరు, టీ, స్నాక్స్ లభించేలా క్యాంటీన్ నడపడానికి వీఎంఆర్‌డీఏ టెండర్లు ఆహ్వానించింది. అందుకు ఒకరు ముందుకు వచ్చారు. అయితే క్యాంటీన్ నడిపే క్రమంలో శీతల పానీయాలు సరఫరా చేసే కంపెనీ బోర్డు ఏర్పాటుచేశారు. దీనిపై కొందరు పురావస్తు ఉద్యమకారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని పురావస్తు శాఖ ఏడీ ఫల్గుణరావు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమాచార కేంద్రంలో ఒక పక్క క్యాంటీన్ నిర్వహణకు అనుమతి ఇచ్చామన్నారు. తొట్లకొండపైకి వచ్చే సందర్శకులకు తాగునీరు, వాష్‌రూమ్, స్నాక్స్, టీ, కాఫీ వంటివి అక్కడ అందుబాటులో ఉంటాయన్నారు.


గిరిపై పద్మనాభుడి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు


మెట్ల మార్గం వద్ద భక్త జన సంద్రం

భక్తులతో పోటెత్తిన పద్మనాభం

పద్మనాభం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అనంత పద్మనాభుని దీపోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది రావడంతో పద్మనాభం జన సంద్రమైంది. స్వామివారిని పలువురు ప్రముఖులు కూడా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు,సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్, జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీఓ సంగీత్‌మాధుర్, విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు (చినశ్రీను), ఎంపీపీ కె. రాంబాబు స్వామివారిని దర్శించుకున్నారు. కాగా అనంతుని గిరి ప్రథమ పావంచాల వద్ద శాశ్వత మండపం నిర్మాణానికి మాజీ ఎంపీ ఝాన్సీ ముందుకు వచ్చారు. తొలి పావంచాల వద్ద ఉత్సవ సమయంలో స్వామివారిని తాత్కాలిక పందిరి వేసి నిలుపుతారు. ఈమేరకు శాశ్వత పందిరిని చేయించాలని, అందుకు అయ్యే వ్యయాన్ని తాను ఇస్తానని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక కళాకారులతో కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు ప్రదర్శించారు. భక్తులు పోటెత్తడంతో దర్శన క్యూలు కిటకిటలాడాయి. మెట్ల మార్గంలోనూ భక్తులు పోటెత్తారు. కొండ దిగువన, గిరిపైన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా ప్రాథమిక వైద్యం అందించారు. తహశీల్దారు ఆనందరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి భక్తులకు అల్పాహారం అందించారు. ఆలయ ఈఓ రాజు, నార్త్ ఏసీపీ అప్పలరాజు సమన్వయంతో వ్యవహరించి, ఉత్సవం ప్రశాంతంగా జరిగేలా చూశారు.


భీమునిపట్నంలోని గాడువీధి శ్మశాన వాటికలో అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్


ఎండాడలో స్మార్ట్ వెండింగ్ జోన్ ఏర్పాటు వివరాలను కమిషనర్‌కి తెలియజేస్తున్న జోన్-2 అధికారులు

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

భీమునిపట్నం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మూడో వార్డులో పర్యటించారు. తొలుత గాడువీధి శ్మశాన వాటికలో రు. కోటి పది లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ, బర్నింగ్ ప్లాట్‌ఫామ్స్, సీసీ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశాన వాటికలో విద్యుత్ లైట్లు, వెయిటింగ్ హాలు, అస్థికలు భద్రపరుచుకోవడానికి లాక్ రూమ్, కేర్ టేకర్, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే మరణాల నమోదు, డెత్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ నిర్వహణ బాధ్యతను వార్డు సచివాలయం శానిటరీ సెక్రటరీకి అప్పగించాలని జడ్సీని ఆదేశించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో శ్మశాన వాటి ఆవరణలో మొక్కలు నాటించాలన్నారు. అనంతరం గొల్లలపాలెం కేజీబీవీకి వెళ్లే మార్గంలో రూ. కోటి 91 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డును పరిశీలించారు. రోడ్డు మార్గంలో ఐదు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం పట్ల అభ్యంతరం తెలిపారు. ఎక్కువగా స్పీడ్ బ్రేకర్లు వేయవద్దని, వాటి వల్ల సీనియరు సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారన్నారు.ఈకార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, భీమిలి జోన్ కార్యనిర్వాహక ఇంజనీరు వెంకటవాసు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు సురేశ్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 3వ వార్డు అధ్యక్షుడు నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

జనగణనకు సహకరించండి

జన గణనకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కమిషనరు కోరారు. ఆయన 3వ వార్డు రెల్లివీధిలో సెన్సస్ ఆపరేషన్స్ డెప్యూటీ డైరెక్టర్ ఎస్. దయాసాగర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనాభా గణన, ఇళ్ల గణన సర్వేకు 2, 3 వార్డులు మోడళ్లగా ఎంపికయ్యాయన్నారు.ఈనెల 30 వరకూ జరిగే సర్వేకు ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని కోరారు.

స్మార్ట్ వెండింగ్ జోన్లు ఏర్పాటు

ఎండాడ : వీధి విక్రయదారుల కోసం ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండింగ్ జోన్లను అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని కమిషనరు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణరాజు, జోన్-2 కమిషనరు కనక మహాలక్ష్మిలతో కలిసి ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో ప్రతిపాదించిన స్మార్ట్ వెండింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో 21 స్మార్ట్ వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయనున్నామని, తొలుత జోన్-2 పరిధిలోని 4, 6 వార్డుల్లో మూడు జోన్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ శాంతిరాజ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ శాస్త్రి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు వితరణ

భీమునిపట్నం (రూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దాకమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత నాని వితరణగా ఇచ్చిన క్రికెట్ కిట్లు, నోట్ పుస్తకాలను జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నగేశ్, సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంగివలస రోడ్డు పరిశీలన

తగరపువలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తమ జిరాయితీ భూముల ఆక్రమణకు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని సంగివలస, వలందపేట గ్రామాలకు చెందిన కొందరు రైతులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రైతులు ఫిర్యాదులో పేర్కొన్న ప్రాంతాన్ని తాము రహదారిగా వినియోగిస్తున్నామని, ఈ దారి మీదుగానే దుర్గాలమ్మ గుడికి వెళ్లే మార్గం ఉందని తెలిపారు. కొంతమంది తమ భూముల్లో రోడ్డు ఉందని కలెక్టర్‌కు తప్పుడు ఫిర్యాదు ఇచ్చి స్వాధీనానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా రహదారిగానే నమోదై ఉందన్నారు. అధికారులు రహదారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ఆక్రమిత స్థలంలో రేకుల షెడ్ నిర్మాణం

- తొలగించేందుకు అధికారుల యత్నం
- అడ్డుకున్న మహిళలు

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణా కాలనీలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న రేకుల షెడ్‌ను తొలగించడానికి అధికారులు ప్రయత్నించగా బాధితులు అడ్డుకున్నారు. తహశీల్దార్ రామారావు ఆదేశాల మేరకు ఆర్ఐ కె. శ్రీదేవి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆక్రమణ తొలగించడానికి సంఘటనా స్థలికి వెళ్లారు. అక్కడ ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న రేకుల షెడ్‌ను తొలగించడానికి జేసీబీని రప్పించారు. బాధిత మహిళలు తమ స్థలంలో షెడ్ నిర్మించుకుంటున్నామని జేసీబీని అడ్డుకున్నారు. అంతే కాదు నిర్మాణదారుడు అప్పలరాజు తన శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంటానని బెదిరించడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. ఆర్ఐ, తహశీల్దార్‌కు సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం


హవనం చేస్తున్న రుత్విక్‌లు

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన తరువాత బింబారాధన, మండపారాధన, కలశారాధన చేసి, ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. అర్చకులు పంచసూక్తాలు, నారసింహ సుదర్శన మూల మూర్తి మంత్రాలను పఠిస్తూ హవనాన్ని నిర్వహించారు. అనంతరం పూర్ణకలశాన్ని వైదికస్వామి శిరస్సున దాల్చి బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలో మూలవిరాట్ వద్ద నుంచి పూజలు జరిపారు. తరువాత మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు.

మల్లన్న సన్నిధిలో మాజీ మంత్రి ముత్తంశెట్టి


శ్రీశైలంలో ముత్తంశెట్టి నివాసరావు

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస శివరాత్రి పురస్కరించుకుని శ్రీశైలంలో మల్లన్నస్వామిని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి జ్ఞానేశ్వరి, అవంతి విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్, వైస్ చైర్మన్ ముత్తంశెట్టి శివనందీష్, కనక శ్రావణి పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన రోడ్డు ధ్వంసం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆనందపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పందలపాకలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వేసిన రోడ్డును రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. 'ప్రభుత్వ భూమి ఆక్రమణ' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తక వారు స్పందించారు. వీఆర్ఓ రమేశ్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీతో రోడ్డును తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

కత్తితో దాడి కేసులో ముగ్గురి అరెస్టు

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అప్పు తీర్చమన్నందుకు కత్తితో దాడి చేసి గాయపర్చిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. భీమిలి మండలం కొత్తవలస గ్రామంలో తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు కోరాడ అప్పలరాజుపై బీజపు శ్రీనివాస్ మంగళవారం కత్తితో దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. బాధితుడు ఫిర్యాదు మేరకు బీజపు శ్రీనివాస్‌తో పాటు అతనికి సహకరించిన నిందితుడి చిన్న, బీజపు పైడిరాజును కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి తెలిపారు. మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకూ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

పారా స్విమ్మింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ 25వ పారా స్విమ్మింగ్ పోటీల్లో వారిజ ఆశ్రమం నేత్ర విద్యాలయానికి చెందిన విద్యార్థులు పలు పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ఈనెల 16, 17 తేదీల్లో ఈ పోటీలు జరిగాయి. విద్యాలయానికి చెందిన ఆరుగురు విద్యార్థులు పలు పతకాలు సాధించారు.

రైతులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన తాటితూరు గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం మొదట విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడత నియోజకవర్గంలో 14,051 మంది రైతులకు రూ. 10.06 కోట్ల విడుదల చేశామని చెప్పారు. మండలాల వారీగా ఆయా ప్రాంతాల్లోని రైతులకు అధికారుల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు నగదు పంపిణీ చేస్తారని తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మొదటి విడత నిధులను విడుదల చేశామన్నారు. రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎల్లవేళలా కోరుకుంటారని, తుపాన్‌కు పంటలు నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ అరులైన రైతులందరికీ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. అర్హులై ఉండి పథకం అందని వారు ఉంటే స్థానిక అధికారులను సంప్రతించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దేదీప్యమానంగా పద్మనాభుని దీపోత్సవం

... 5వ పేజీ తరువాయి

రాలేమని భావించిన కొందరు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించేశారు. కుంతీమాధవస్వామి ఆలయం నుంచి సాయంత్రం నాలుగు గంటల సమయంలో శ్రీదేవి, భూదేవ సమేత అనంతపద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపి తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 5.30 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం తొలి పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు మెట్లపై అప్పటికే సిద్ధం చేసుకున్న దీపాలు ఒక్కసారిగా వెలిగించారు. దీంతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానమైంది. కొండపైన, దిగువన భక్తులకు దాతలు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసులు ట్రాఫిక్ నియంత్రణతోపాటు, శాంతిభద్రతలు, ఇతర బందోబస్తు పనులు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటుచేసిన పోలీసులు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా ఉత్సవం మొత్తాన్ని పర్యవేక్షించారు. ఉత్సవానికి సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన ఎమ్మెల్యే గంటాతో కలిసి తొలి పావంచా వద్ద స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, టీడీపీ సీనియర్ నాయకులు దామోదరరావు, నగేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణం పేరిట దందా

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకి అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగరంలో ఐదు వార్డుల్లో స్మార్ట్ వెండింగ్ జోన్‌లను తక్షణం ఏర్పాటుచేసేందుకు అవసరమైన స్థలం ఉందని, మరో 128 చోట్ల స్ట్రీట్ వెండింగ్ జోన్స్ ఏర్పాటుకు అవకాశం ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు నివేదించారు. యూసీడీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా తొలిదశలో జోన్-2 పరిధిలో ఎండాడ, జోన్-4 పరిధిలో వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు, జోన్-6 పరిధిలో గాజువాక వద్ద స్మార్ట్ వెండింగ్ జోన్‌లను ప్రారంభించేందుకు కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారుల వాటా కింద కొంత మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణం రూపంలో తీసుకుని జీవీఎంసీ కొంత మొత్తం కలిపి కంటెయినర్ దుకాణాలను ఏర్పాటుచేసి వాటికి ఫ్యాన్, సోలార్ లైటింగ్, వై-ఫై, తాగునీరు, వాష్‌బేసిన్ వంటి సదుపాయాలను కల్పించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా డిజైన్ రూపొందించారు.

సెంట్రల్ పార్కు వద్ద దుకాణానికి రూ.లక్ష

సెంట్రల్ పార్కు తూర్పు, పడమర, దక్షిణ దిక్కుల్లో 120 దుకాణాల ఏర్పాటుకు వీలుగా ఆర్కిటెక్చర్ డిజైన్ తయారుచేశారు. స్ట్రీట్ వెండార్లుగా పేర్లు నమోదుచేసుకున్న వారిలో అర్హులకు అక్కడ దుకాణాలు కేటాయించాలి. ఒక వేళ దుకాణాల కంటే ఆశావహులు ఎక్కువగా ఉన్నట్టయితే లాటరీ ద్వారా ఎంపిక చేయాలి. కానీ కూటమి నేత పేరు చెబుతూ...ముగ్గురు దళారులు రంగంలోకి దిగారు. సెంట్రల్‌పార్కు వద్ద ఏర్పాటుచేసే వెండింగ్ జోన్‌లో దుకాణం ఇప్పిస్తామంటూ వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఒక్కో దుకాణం కోసం రూ.లక్ష చొప్పున వసూలుచేస్తున్నారు. రూ.లక్ష కంటే ఎక్కువమొత్తం ఇస్తామంటూ కొందరు పోటీ పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో ఫుడ్‌కోర్టు ద్వారా జీవీఎంసీకి ఒక్క రూపాయి ఆదాయం లేకపోయినా, వైసీపీ నేతలు, కూటమి నేతలు దుకాణాల నుంచి రోజువారీ వసూళ్లు చేసుకున్నారు. ఫుడ్‌కోర్టును తొలగించేందుకు అధికారులు ప్రయత్నించినా, కౌన్సిల్‌లో పలుమార్లు తీర్మానం చేసినా వారే అడ్డుకున్నారు. చివరకు కమిషనర్ కేతన్‌గార్గ్ ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తలొగ్గకుండా తొలగించారు. ఇలాంటి తరుణంలో దళారు లు మళ్లీ రంగప్రవేశం చేయకుండా కమిషనర్ అడ్డుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

ఉక్కు ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఈ ఏడాది ఆగస్టు వరకు లెక్క చూసుకుంటే ఉద్యోగులు, కార్మికులకు 355 శాతం జీతాలు అంటే సుమారుగా రూ.350 కోట్ల బకాయిలు ఉన్నాయి. వాటిని విడుదల చేయాలని కోరుతుంటే...నవంబరు నుంచి ఎంత ఉత్పత్తి తీస్తే అంతే జీతాలు అని ప్రకటించారు. దీంతో పుండు మీద కారం రాసినట్టు అయింది.

దేశంలో ఎక్కడా లేదు

ఉత్పత్తికి అనుగుణంగా జీతాలు ఇచ్చే విధానం దేశంలో ఏ స్టీల్‌ప్లాంటులోనూ లేదు. పైగా ఇక్కడ పూర్తిస్థాయి ఉత్పత్తితో ప్లాంటును నడిపేందుకు అవసరమైన వనరులు యాజమాన్యం వద్ద లేవు. యంత్ర పరికరాలు అందుకు అనుగుణంగా లేవు. నిర్వహణ పనులు ఆపేశారు. అనేక విభాగాలు మరమ్మతుల్లో ఉన్నాయి. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో మంగళవారం బెల్ట్ తెగిపోయింది. దానివల్ల మూడు రోజులు ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉంది.

రాంబిల్లిలో రిలయన్స్

... 5వ పేజీ తరువాయి

మినహాయింపు యూనిట్‌కు రూపాయి చొప్పున ప్రకటించారు. ఐదేళ్లకు దీని ద్వారా మరో రూ.27.6 కోట్ల ప్రయోజనం కలుగుతుంది. ఈ రాయితీల ద్వారా సుమారు రూ.330 కోట్లు సంస్థకు వెనక్కి వెళతుంది. కేటాయించిన భూమిలో ఏమైనా మౌలిక వసతులు కావాలని సంస్థ కోరితే...వాటికి ఎంత ఖర్చు అయితే అంత వారే చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన విధించారు. ప్రకటించిన రాయితీలు కొన్ని పాలసీలో లేకపోయినా పెద్ద పరిశ్రమ కావడంతో ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నారు.

రేపటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

పోలీసు అధికారులకూ సూచించారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టంగా చెప్పారు.

ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ తప్పనిసరి

ఈ ఆలయంలో ప్రసాదాలు, అన్నదానం నాణ్యత తగ్గిపోయిందని గతంలో ఆరోపణలు వచ్చాయి. ఆయా విభాగాల నుంచి నెలవారీ మామూళ్లు ఆశించడమే కారణమనే అభియోగాలు వచ్చాయి. ఈ విషయం పత్రికల్లో రావడంతో ఉన్నతాధికారులు దృష్టిపెట్టారు. సిబ్బంది విధుల్లో మార్పులు చేశారు. ఇప్పుడు మార్గశిర మాసం నెల రోజులు జగన్నాథస్వామి ఆలయంలో రోజూ వేలాది మందికి అన్నదానం నిర్వహించనున్నారు. పెద్ద సంఖ్యలో ప్రసాదాలు తయారు చేస్తారు. వీటిలో నాణ్యత తగ్గితే చెడ్డపేరు వస్తుందని కలెక్టర్ ఆలయ అధికారులకు ప్రత్యేకమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రసాదాలు, అన్నదానానికి ఉపయోగించే దినుసులు, వాటితో తయారయ్యే ఆహారాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీ చేయించి, సర్టిఫికెట్ తనకు పంపాలని సూచించారు. దీంతో ఆలయ అధికారుల గుండెల్లో రాయిపడింది. నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉత్సవాల సమయంలో ఎటువంటి చెడ్డపేరు రాకుండా చూడాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో ఆ వంకతో తమను ఆలయ అధికారి ఏ రకమైన ఇబ్బందులకు గురిచేస్తారోనని సిబ్బంది భయపడుతున్నారు. ఏ తప్పు నెట్టి ఎటువంటి చర్యలు చేపడతారోనని ఆందోళన చెందుతున్నారు.

రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ రామలక్ష్మి, పలువురు కూటమి తదితరులు

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వివేకానందనగర్‌లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.30 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ 10వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వేముల వెంకటరావు, టీడీపీ 10వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిలి రాజేష్, బీజేపీ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, జనసేన 10వ వార్డు అధ్యక్షుడు బండి రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఆర్ఆర్ నగర్‌లో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకోజీపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని జేఆర్‌నగర్‌లో చెత్త నిల్వలు పేరుకుపోయాయని 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వచ్చిన కథనానికి శానిటరీ సిబ్బంది స్పందించారు. వెంటనే చెత్త నిల్వలను తొలగించి రోడ్లను శుభ్రంగా తీర్చిదిద్దారు. దీంతో స్థానికులు ఆనం దం వ్యక్తం చేశారు.



చెత్త తొలగించడంతో పరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

ఆరోగ్యవంతులైన పిల్లలతోనే దేశప్రగతి సాధ్యం

» సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు



వైద్య శిబిరంలో పాల్గొన్న జస్టిస్ సన్యాసినాయుడు, పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రగతి ఆరోగ్యవంతులైన పిల్లలతోనే సాధ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. బాలల వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని మత్స్యకార పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆయుర్వేవ ఎన్జీవో, మెడికవర్ ఆస్పత్రి, స్మార్ట్ సిటీ కన్జూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంయుక్తంగా శిబిరాన్ని నిర్వహించారు.

ఆయా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గొండు సీతారాం, ఎస్.సుబ్బలక్ష్మి, పేర్ల భాస్కరరావు, వైద్యులు ప్రియాంక, తులసి, వైష్ణవి, ఆదిత్య రంగనాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ కేవీఎస్ వాణి తదితరులు సేవలు అందించారు.

23న టీటీడీలో వేదాంత శ్రవణం

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణమండపంలో దక్షిణామ్నాయ జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం శ్రీశృంగేరి శారదా పీఠం అనుబంధ సంస్థ అహం బ్రహ్మాస్మి ఆధ్వర్యంలో గురు వైభవం వేదాంత శ్రవణం కార్యక్రమం నిర్వహించనున్నట్టు సమన్వయకర్త అవసరాల సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్వనాథ్ గోపాలకృష్ణ శాస్త్రి, ప్రముఖ భాషా, శాస్త్ర పండితుడు పేరి రవికుమార్ ప్రవచనం ఉంటుందని తెలిపారు. భక్తులందరూ హాజరు కావచ్చని, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు : 95022 38017, 91606 86669లో సంప్రదించాలన్నారు. వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడీ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** :శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 76, బెండకాయలు 62, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 60, బీరకాయలు 56, ఆనపకాయ 36, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 28, క్యారెట్ 56, దొండకాయలు 60, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 54, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 90, గోరు చిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

ఏపీఆర్జేసీ స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్జేసీ నాగార్జున సాగర్ కళాశాల స్వర్ణోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను పూర్వ విద్యార్థుల సంఘం బుధవారం ఆవిష్కరించింది. వచ్చే నెల 13, 14 తేదీల్లో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తారు. అనేక ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విశాఖలోని పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ భాస్కరరావు, బి.నిశాంత్, జి.రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొనాలనుకునే పూర్వ విద్యార్థులకు సహకారం కావాలంటే బి.నిశాంత్ ఫోన్ 94417 35674 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు చోట్ల ఉన్న పూర్వ విద్యార్థులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



జీవీఎంసీ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించిన కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ సమావేశమందిరంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి రెవెన్యూ విభాగం అధికారులు, జోనల్‌కమిషనర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్నుల వసూళ్లతోపాటు బకాయిలు, నీటిచార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. కొన్నిజోన్ల పరిధిలో పన్నుల వసూళ్లు మందకొడిగా ఉన్నాయని, కొత్తగా ఆర్ఓలుగా నియమితులైనవారు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులతో కలిసి రోజువారీ లక్ష్యం పెట్టుకుని పన్నువసూళ్ల ద్వారా జీవీఎంసీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. జోనల్ కమిషనర్లకు రూ.రెండు లక్షల వరకు నిధులు మంజూరుచేసే అవకాశం కల్పించామని, జెడ్సీలు దీనిని తమ జోన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించాలని ఆదేశించారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి

» విశాఖ ఎంపీ శ్రీభరత్

» ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కోనసీమ జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశాఖ ఎంపీ భరత్

ఆత్రేయపురం, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లోని వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వామివారి ఆలయ అభివృద్ధిలో కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.1.16 కోట్లతో నిర్మిస్తున్న టెన్షల్ షెడ్ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు.

సిద్ధివినాయక ఆలయంలో పూజలు

అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో ఎంపీ శ్రీభరత్ పూజలు నిర్వహించారు. బుధవారం సిద్ధివినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

బాలికల గృహంలో వైద్య శిబిరం

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వేలీ స్కూలు సమీపంలో గల ప్రభుత్వ బాలికల గృహంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు-నివారణ చర్యల గురించి బాలికలకు వైద్యులు వివరించారు. అనంతరం 70 మంది బాలికలకు రక్త పరీక్షలు చేశారు. మధ్యాహ్నం కౌన్సిలర్ పద్మ బాలికల గృహాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా బావోద్వేగంతో వచ్చేమార్పులను వివరించారు. ప్రతి ఒక్కరూ పాజిటివ్ దృక్పథంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి సినయోమి, వైద్యాధికారి డాక్టర్ శోభారాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. గ్రంథాలయాధికారి కేవీఏ ఉమా మహేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయితలు అడపా రామకృష్ణ, కృష్ణబాబు, సునర్ల సర్వేశ్వర శాస్త్రి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కవులు తెలుగు, హిందీ భాషల్లో కొన్ని పద్యాలను ఆలపించారు. తెలుగు బాష గొప్పదనం గురించి వివరించారు. పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు

సిద్ధార్థనగర్‌లో కార్డెన్ సెర్చ్

మద్దిలపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శాంతి భద్రతల సీఐ పైడయ్య నేతృత్వంలో పోలీస్ బృందాలు ఇంటింటికి తిరిగి ఆకస్మిక సోదాలు చేశారు. ఇళ్లల్లో బ్యాగులు, సూట్‌కేసులు తెరిచి తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిపి పత్రాలు పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని 8 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ పైడయ్య మాట్లాడుతూ తమ పరిధిలో సురక్షిత భద్రత కల్పించడం కోసం కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సోదాలు చేపట్టామన్నారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను తనిఖీలు చేశామన్నారు. ఏదైనా ప్రాంతంలో కొత్త వ్యక్తుల సంచారం, అనుమానస్పదంగా తిరిగే వ్యక్తులపైనా పోలీసులకు సమాచారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు.



ఇంట్లో తనిఖీలు చేస్తున్న త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ పైడయ్య

బీసీ కాలనీలో అగ్నిప్రమాదం



కాలిపోయిన సామగ్రి

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవలోని బీసీ కాలనీలో అగ్నిప్రమాదం సంభవించడంలో ఇంట్లో ఉన్న సామగ్రి దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి.

బీసీ కాలనీలోని ఓ పూరింట్లో కొండేటి ఈశ్వరరావు దంపతులు నివాసం ఉంటున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేసే వీరిద్దరూ బుధవారం ఉదయమే వారి కార్యాలయాలను వెళ్లిపోయారు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంల ఆ ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన కొందరు స్థానికులు కిటికీ నుంచి చూసి మంటలను గుర్తించారు. వెంటనే ఆ మంటలను అదుపు చేశారు. అనం తరం విషయాన్ని ఈశ్వరరావు దంపతులకు, చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి చేరవేశారు. విద్యుదాఘాతం వల్ల అగ్ని ప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. వీఆర్వో వచ్చి పరిశీలించారు.

కుండలేశ్వర ఆలయం వద్ద భక్తురాలు మృతి

మృతురాలు విశాఖ వాసిగా గుర్తింపు

కాట్రేనికోన, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరస్వామిని దర్శించుకుని తరించాలని ఒక భక్తురాలు విశాఖ నుంచి బుధవారం కుండలేశ్వరం వచ్చింది. ఎంతో భక్తితో స్వామిని దర్శించుకుని పూజించింది. స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించింది. ఆలయం బయట కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ శాశ్వత నిద్రలోకి జారుకుంది. ఈ ఘటన కుండలేశ్వర క్షేత్రంలో విషాదం నింపింది. విశాఖకు చెందిన భక్తురాలు బొట్టా నిర్మల (67) గుండె పోటుతో ఆలయం బయట మృతి చెందింది. ఈ ఘటనతో భక్తులందరూ అవాక్కయ్యారు. నిర్మల కుండలేశ్వరం వచ్చి గోదావరిలో స్నానమాచరించి ఎంతో భక్తితో స్వామిని ఆరాధించింది. అన్నప్రసాదం తీసుకున్న తర్వాత ఆలయం వద్ద బయట కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంది. అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో కుప్పకూలింది. అక్కడ ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది తక్షణం స్పందించినా ఫలితం లేకపోయింది. పవిత్ర కుండలేశ్వర స్వామి సన్నిధిలో తనువు చాలించిన నిర్మల అదృష్టానికి ఆనందపడాలో, దైవదర్శనానికి వచ్చి మృత్యువాత పడినందుకు విచారించాలో తెలియని అయోమయ పరిస్థితిలో తోటి భక్తులు సతమతమయ్యారు.

ఏరో స్పేస్ శిక్షణకు 30మంది పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక

కంచరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఖరి సెమిస్టర్ చదువుతున్న మెకానికల్ బ్రాంచి విద్యార్థులు ఏరో స్పేస్ శిక్షణకు ఎంపికయ్యారు. బోయింగ్ సీఎస్ఆర్ నిధులతో లెర్నింగ్‌లింక్స్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో సాంకేతిక విద్యాశాఖ ప్రాయోజకంగా ఏరో స్పేస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌లో ఆరు నెలలు పారిశ్రామిక శిక్షణను వీరికి అందిస్తారు. మెకానికల్ విభాగంలో 30 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు ఎంవీ రామకృష్ణ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ రంగంలో విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రష్మీ మిశ్రా, సీనియర్ మేనేజర్ కె.శేఖర్ రెడ్డి, డా.ఎం.నారాయణరావు, మెకానిక్ విభాగం అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు రామకృష్ణ

నైపుణ్యవంతమైన బోధన అవసరం

» ఆర్జేడీ విజయ్‌భాస్కర్



టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ భాస్కరరావు

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నైపుణ్యవంతమైన బోధన చేయడం వల్ల విద్యార్థులకు చక్కని మార్గనిర్దేశం చేసిన వారవుతారని విద్యాశాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. తోటగరువు జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో మంగళ, బుధవారం ఉపాధ్యాయులకు టూల్ శిక్షణ నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో గల ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీఎఫ్‌లకు రెండు రోజులుగా తోటగరువు ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్స్ రిఫ్రెష్ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. బోధనా నియమావళి, తరగతి గది, వాతావరణం చక్కగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ చంద్రశేఖర్, డెప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఉక్కు ఉత్పత్తితో వేతనాలు ముడిపెట్టడం అన్యాయం

» గాంధీ విగ్రహం ఎదుట ఏఐటీయూసీ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నేతలు, కార్యకర్తలు

సిరిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉత్పత్తి మేరకు జీతం చెల్లిస్తామని స్టీల్‌ప్లాంటు యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి జీఎస్ఎల్ అచ్యుతరావు మాట్లాడుతూ కార్మికుల పట్ల స్టీల్‌ప్లాంటు యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగాలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంటుపై చేస్తున్న ప్రకటనలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. మిట్టల్ స్థాపించే స్టీల్‌ప్లాంట్‌పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ రంగ సంస్థపై లేకపోవడం విచాకరమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మన్మథరావు, రమణ, వెంకటరావు, ఎస్కే. రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కేర్‌లో విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్స



కేర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న రోగి, విమ్స్ డైరెక్టర్, జీవన్‌ధాన్ చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు, వైద్యులు

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుండె సమస్యతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరిన రోగికి గుండె మార్పిడి శస్త్ర చికిత్సను కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించి ప్రాణాలను కాపాడారు. ఈ శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను ఆరిలోవ హెల్త్ సిటీలోని కేర్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి కార్డియాక్ సర్జరీ క్లినికల్ డైరెక్టర్, లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ ఎల్.విజయ్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ గుండె జబ్బుతో (బ్లాక్స్ ఏర్పడి) బాధపడుతూ పాత్రో (54) ఏళ్ల వ్యాపారవేత్త మూడు నెలలు కిందట ఆస్పత్రికి వచ్చారు. పరీక్షలు నిర్వహించగా గుండె మార్పిడి శస్త్రచికిత్స చేయించాల్సి ఉంటుందని గుర్తించామని, ఇదే విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. జీవన్‌ధాన్ ద్వారా పాత్రోకు సరిపోలిన గుండెను కేటాయించడంతో అత్యంత జాగ్రత్తగా గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం ఈ నెల ఆరో తేదీన రోగిని డిశ్చార్జ్ చేశామని, ఫాలో అప్ చికిత్సకు వచ్చిన రోగికి పరీక్షలు నిర్వహించామన్నారు. ఎటువంటి నొప్పి లేకుండా సులభంగా నడుస్తున్నారని, గుండె పనితీరు, రక్త పరిమితులు సాధారణంగా ఉన్నాయన్నారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహణ ఒక్కరితో సాధ్యం కాదని, అనేక విభాగాలకు చెందిన నిపుణులు, దాత నుంచి గుండెను సురక్షితంగా తీసుకోవడం, దాన్ని జిల్లాల మధ్య రవాణా చేయడం, గ్రహీతకు అంతే సురక్షితంగా అమర్చడంతో ఎంతోమంది కీలక పాత్ర వహించారన్నారు. ఐదేళ్ల తరువాత విశాఖలో గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. జీవన్‌ధాన్ చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ ఈ గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయ్యేలా రిట్రీవల్ హాస్పిటల్, ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్, పోలీస్‌శాఖ, జీవన్‌దాన్ బృందం అద్భుతంగా కలిసి పని చేశాయన్నారు. ఇటువంటి సమన్వయంతో అవయవ బాధితులకు సకాలంలో అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విశాఖ అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్) కె.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అవయవ రవాణాకు ఎటువంటి అడ్డంకులు లేకుండా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేశా మన్నారు. ఈశస్త్రచికిత్సను డాక్టర్ విజయ్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు నేతృత్వంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్, కార్డియాలజీ, అనస్థీషియా విభాగాలకు చెందిన వైద్యులు బృందం నిర్వహించింది. సమావేశంలో ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్‌ఆఫీసర్ సుఖేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇగ్నో వ్యవస్థాపక దినోత్సవం



ఇందిరా గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం సిబ్బంది

ఎంవీపీ కాలనీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉషోదయ కూడలిలోని ఇందిరా గాంధీ జాతీయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రంలో 40వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సీనియర్ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఇగ్నో అదనపు సంచాలకుడు డాక్టర్ .కృష్ణారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 13వ వార్డు కేంద్రకారాగారం సమీపంలో గల రామకృష్ణాపురంలో గుర్తు తెలియని వృద్ధుడు (70) బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆరిలోవ పోలీసులు తెలిపారు. ఇతడు మూడు రోజుల నుంచి రామకృష్ణాపురం ప్రాంతంలో ఉంటున్నాడని, గ్రామస్థులు భోజనం అందించేవారని తెలిపారు. బుధవారం ఉదయం 5-30 వరకు బాగానే ఉన్నాడని తెలిపారు. ఉదయం 6.30 గంటల సమయంలో మృతి చెందాడని గ్రామస్థులు తెలిపినట్లు ఆరిలోవ పోలీసులు చెప్పారు. వృద్ధుడిని గుర్తించినవారు తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

నేతాజీ క్లబ్‌కు నూతన కార్యవర్గం

కంచరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం మెట్టు వద్ద దశాబ్దాల చరిత్ర కలిగిన నేతాజీ క్లబ్ (గ్రంథాలయం) అభివృద్ధి నిమిత్తం నూతన కమిటీ సభ్యుల ఎన్నిక బుధవారం జరిగింది. గతంలో ఈ క్లబ్ అనేక క్రీడలు, కళలకు జ్ఞాన కేంద్రంగా ఉండేది. ప్రముఖ దినపత్రికలు, వార పత్రికల కోసం పాఠకులు అధిక సంఖ్యలో వస్తుండేవారు. కాల క్రమేణా రోడ్డు విస్తరణలో క్లబ్ భవనం పోవడంతో నిరాదరణకు గురైంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, స్థానికులు సహకారంతో క్లబ్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి నూతన కమిటీ ఏర్పాటు జరిగింది. క్లబ్‌కు నూతన కమిటీని గ్రామస్థులు ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడుగా పల్లా సత్యానారాయణ (రిటైర్డ్ రైల్వే), ఉపాధ్యక్షుడుగా కోన రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లా భాస్కరరావు, సంయుక్త కార్యదర్శిగా బంధం నరసింగరావు, కోశాధికారిగా నమ్మి ఆనంద శివప్రసాద్ (నాని) ఎంపికయ్యారు. ఎంపికైన సభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో క్లబ్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

బర్మా కాందీశీకుల సంఘం సంయుక్త కార్యదర్శిగా నారాయణరావు



అక్కయ్యపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బర్మా కాందీశీకుల పునరావాస సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మర్రా నారాయణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.రాజా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి సమస్యలపై పోరాడతానని చెప్పారు. అలాగే బర్మా కాందీశీకుల కోసం ఏర్పాటు చేసిన రెప్కో బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ బ్యాంకును కాందీశీకులు, శరణాగతుల కుటుంబాల కోసం అప్పటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 60 పైసల వడ్డీకే రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు.

స్టీల్‌ప్లాంటును కాపాడుకుందాం

- కాంగ్రెస్ నేత ప్రియాంక దండి
- మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి నివాళులు

సీతమ్మధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది ప్రాణాలు అర్పించి ఆమరణ నిరాహార దీక్ష చేసి పోరాటంలో 32 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అప్పటి ప్రధాని, స్వర్గీయ ఇందిరా గాంధీ స్టీల్ ప్లాంటును విశాఖకు తెచ్చిందని, అటువంటి స్టీల్‌ప్లాంటును కాపాడుకుందామని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జ్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు సీతమ్మధార నక్కవానిపాలెంలో గల ఇందిరాగాంధీ పార్కులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా



ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

దండి ప్రియాంక మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం అప్పటి ఉత్తరాంధ్ర కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేశారని, పోరాట స్ఫూర్తిని చూసి చివరికి ఇందిరమ్మ విశాఖకు స్టీల్‌ప్లాంటు ఇచ్చిందన్నారు. ప్రపంచంలో స్టీల్ వినియోగం పెరిగిందని, చైనా స్టీల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని, తరువాత స్థానంలో భారత్ ఉందని, దేశంలో సొంత గనులు ఉన్న అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్, దాంట్లో విలీనం చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంటు లాభాల్లోకి వస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కానీయమని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సెయిల్‌లో విలీనం చేసి స్టీల్‌ప్లాంటును కాపాడుకునేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి పర్వీన్ ఖాన్, జగన్ మురారి, వార్డు అధ్యక్షుడు బి.శ్రీనివాస్, గుర్రం కనకరాజు, వేమూరి సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

వైశాఖీస్పోర్ట్సు పార్కు అభివృద్ధికి రూ.7.5 లక్షల విరాళం



కమిటీ ప్రతినిధులకు చెక్ అందజేస్తున్న పూర్ణచంద్రరావు దంపతులు

మురళీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ; గ్రేటర్ విశాఖ 50వ వార్డులోని మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో కళాక్షేత్రం అభివృద్ధి పనులకు వేములపల్లి పూర్ణచంద్రరావు దంపతులు రూ.7.5 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు పార్కు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ రాజుకు చెక్‌ను అందించారు. గతంలోనూ ఈయన రూ.4.5 లక్షలను అందించడంతో దాతల ఇంటిపేరుతోనే వేములపల్లి కళాక్షేత్రం పేరు పెట్టి, నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పార్కు కమిటీ సభ్యులు హాజరై దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. శాశ్వత అభివృద్ధి పనులకు సహకరిస్తున్న వారితోనే నేడు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు (స్కేటింగ్ పార్కు) పార్కు స్థిరమైన ప్రగతి సాధించిందని సభ్యులు పేర్కొన్నారు.

ఏరో స్పేస్ శిక్షణకు 30 మంది పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక

కంచరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆఖరి సెమిస్టర్ చదువుతున్న మెకానికల్ బ్రాంచి విద్యార్థులు ఏరో స్పేస్ శిక్షణకు ఎంపికయ్యారు. బోయింగ్ సీఎస్ఆర్ నిధులతో లెర్నింగ్‌లింక్స్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో సాంకేతిక విద్యా శాఖ ప్రాయోజకంగా ఏరో స్పేస్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌లో ఆరు నెలలు పారిశ్రామిక శిక్షణను వీరికి అందిస్తారు. మెకానికల్ విభాగంలో 30 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు ఎంవీ



ఎంపికైన విద్యార్థులతో డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు రామకృష్ణ

రామకృష్ణ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ రంగంలో విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రష్మీ మిశ్రా, సీనియర్ మేనేజర్ కె.శేఖర్ రెడ్డి, డా.ఎం.నారాయణరావు, మెకానిక్ విభాగం అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గీతం విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ బుధవారం ముగిసింది. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం నిర్వహించిన ఈ టోర్నీలో సబ్ జూనియర్, జూనియర్ సీనియర్ పురుషుల మహిళల విభాగాల్లో 550 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గీతం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, అసిస్టెంట్ డీన్ అరుణ్ కార్తీక్ హాజరై విజేతలకు పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ.అప్పలరాజు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, శాప్ డైరెక్టర్ రమేశ్‌కుమార్, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఉపాధ్యక్షులు డాక్టర్ డీవీఎస్‌వై శర్మ, బి.శ్రీనివాస్, జిల్లా సంఘం కార్యదర్శి కేవీఎం మురళి పాత్రో తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో గీతం వర్సిటీ రిజిస్ట్రార్ గుణశేఖరన్ తదితరులు

విజేతలు : సింగిల్స్ అండర్-17 బాలుర విభాగంలో సంవేద్ తెల్‌ప్రోలు (ఎన్టీఆర్), వేదాంశ్ నాదెళ్ల (ఎన్టీఆర్)..., బాలికల విభాగంలో ఎస్కే .ఆరిఫా సుల్తాన (విశాఖ), మౌపర్ణదాస్ (కాకినాడ); అండర్-19 బాలుర విభాగంలో మహీధర్ వర్మ (విశాఖ), చేతన్ సాయి పట్నాన (ఎన్టీఆర్)....బాలికల కేటగిరిలో శ్రీకర లాస్య పమిడిమర్రి (ఎన్టీఆర్), మౌపర్ణదాస్ (కాకినాడ); సీనియర్ పురుషుల విభాగంలో దాస్ కౌషల్ (విశాఖ), మణికుమార్ పొన్నూరు వెంకట (విశాఖ).., మహిళల విభాగంలో మౌనిక మనోహర్ (ఎన్టీఆర్), కాజోల్ సునార్ రామ్‌జాలి (ఎన్టీఆర్) విన్నర్, రన్నరప్ స్థానాలను సొంతం చేసుకున్నారు.

జాతీయ ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ టోర్నీకి ఏయూ జట్టు ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును బుధవారం ప్రకటించారు. ఈ నెల 24 నుంచి రాజస్థాన్‌లో జరగనున్న ఈ టోర్నీలో జి.నీరజసాయికుమార్, ఎస్కేకే కోమల్, బి.రాహుల్, కె.కార్తీక్, పి.శరణ్ కుమార్ ఏయూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకులు ఎన్.విజయ్‌మోహన్ తెలిపారు.

ఈ జట్టుకు మేనేజర్‌గా ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి ఎ.పల్లవి వ్యవహరిస్తారని వెల్లడించారు.

... 5వ పేజీ తరువాయి

రాంబిల్లిలో రిలయన్స్

మినహాయింపు యూనిట్‌కు రూపాయి చొప్పున ప్రకటించారు. ఐదేళ్లకు దీని ద్వారా మరో రూ.27.6 కోట్ల ప్రయోజనం కలుగుతుంది. ఈ రాయితీల ద్వారా సుమారు రూ.330 కోట్లు సంస్థకు వెనక్కి వెళుతుంది. కేటాయించిన భూమిలో ఏమైనా మౌలిక వసతులు కావాలని సంస్థ కోరితే...వాటికి ఎంత ఖర్చు అయితే అంత వారే చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన విధించారు. ప్రకటించిన రాయితీలు కొన్ని పాలసీలో లేకపోయినా పెద్ద పరిశ్రమ కావడంతో ప్రత్యేక నిర్ణయాలు తీసుకున్నారు.

రేపటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

పోలీసు అధికారులకూ సూచించారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టంగా చెప్పారు.

ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ తప్పనిసరి

ఈ ఆలయంలో ప్రసాదాలు, అన్నదానం నాణ్యత తగ్గిపోయిందని గతంలో ఆరోపణలు వచ్చాయి. ఆయా విభాగాల నుంచి నెలవారీ మామూళ్లు ఆశించడమే కారణమనే అభియోగాలు వచ్చాయి. ఈ విషయం పత్రికల్లో రావడంతో ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. సిబ్బంది విధుల్లో మార్పులు చేశారు. ఇప్పుడు మార్గశిర మాసం నెల రోజులు జగన్నాథస్వామి ఆలయంలో రోజూ వేలాది మందికి అన్నదానం నిర్వహించనున్నారు. పెద్ద సంఖ్యలో ప్రసాదాలు తయారు చేస్తారు. వీటిలో నాణ్యత తగ్గితే చెడ్డపేరు వస్తుందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆలయ అధికారులకు ప్రత్యేకమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రసాదాలు, అన్నదానానికి ఉపయోగించే దినుసులు, వాటితో తయారయ్యే ఆహారాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీ చేయించి, సర్టిఫికెట్ తనకు పంపాలని సూచించారు. దీంతో ఆలయ అధికారుల గుండెల్లో రాయి పడింది.నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉత్సవాల సమయంలో ఎటువంటి చెడ్డపేరు రాకుండా చూడాలని జిల్లాఅధికారులు ఆదేశించడంతో ఆ వంకతో తమను ఆలయ అధికారి ఏ రకమైన ఇబ్బందులకు గురి చేస్తారోనని భయపడుతున్నారు. ఏ తప్పు తమపైకి నెట్టిఎలాంటి చర్యలు చేపడతారోనని ఆందోళనచెందుతున్నారు.

బౌద్ధ వివరణ కేంద్రంలో క్యాంటీన్!

... 5వ పేజీ తరువాయి

అప్పటి పాలకులు రూ.1.8 కోట్లు మంజూరుచేశారు. ఆ సెంటర్‌లో ప్రాజెక్టర్ ద్వారా బౌద్ధమత విశిష్టతను తెలియజేసే డాక్యుమెంటరీ ప్రదర్శన, లైబ్రరీ, ఇతర వసతులు, హాలు, మరుగుదొడ్లు, సమాచారం అందించే డెస్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ భవన నిర్మాణం 2016-17లో పూర్తిచేశారు. ఇంతవరకూ భవనం ప్రారంభించాలనే విషయాన్ని పురావస్తుశాఖ అధికారులు మరిచిపోయారు. కొండపైకి వచ్చే వారికి కనీసం తాగునీటి సదుపాయం కూడా లేదు. ఈ ఏడాది మే నెలలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయజైన్ తొట్లకొండను సందర్శించి అక్కడ వసతులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కొండపై కొత్తగా నిర్మించిన భవనం ఎందుకు వినియోగించలేదని అధికారులను నిలదీశారు. చివరకు ఆయన జోక్యంతో వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి తొలుత భవనానికి చిన్నచిన్న మరమ్మతులు చేశారు. అనంతరం అజయజైన్ సూచన మేరకు కొండపైకి వచ్చేవారికి మంచినీరు, టీ, స్నాక్స్ లభించేలా క్యాంటీన్ నడపడానికి వీఎంఆర్‌డీఏ టెండర్లు ఆహ్వానించింది. అందుకు ఒకరు ముందుకు వచ్చారు. అయితే క్యాంటీన్ నడిపే క్రమంలో శీతల పానీయాలు సరఫరా చేసే కంపెనీ బోర్డు ఏర్పాటుచేశారు. దీనిపై కొందరు పురావస్తు ఉద్యమకారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని పురావస్తు శాఖ ఏడీ ఫల్గుణరావు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమాచార కేంద్రంలో ఒక పక్క క్యాంటీన్ నిర్వహణకు అనుమతి ఇచ్చామన్నారు. తొట్లకొండపైకి వచ్చే సందర్శకులకు తాగునీరు, వాష్ రూమ్, స్నాక్స్, టీ, కాఫీ వంటివి అక్కడ అందుబాటులో ఉంటాయన్నారు.

ఉక్కు ఉద్యోగుల ఆందోళన

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఈ ఏడాది ఆగస్టు వరకు లెక్క చూసుకుంటే ఉద్యోగులు, కార్మికులకు 35.5 శాతం జీతాలు అంటే సుమారుగా రూ.350 కోట్ల బకాయిలు ఉన్నాయి. వాటిని విడుదల చేయాలని కోరుతుంటే...నవంబరు నుంచి ఎంత ఉత్పత్తి తీస్తే అంతే జీతాలు అని ప్రకటించారు. దీంతో పుండు మీద కారం రాసినట్టు అయింది.

దేశంలో ఎక్కడా లేదు

ఉత్పత్తికి అనుగుణంగా జీతాలు ఇచ్చే విధానం దేశంలో ఏ స్టీల్‌ప్లాంటులోనూ లేదు. పైగా ఇక్కడ పూర్తిస్థాయి ఉత్పత్తితో ప్లాంటును నడిపేందుకు అవసరమైన వనరులు యాజమాన్యం వద్ద లేవు. యంత్ర పరికరాలు అందుకు అనుగుణంగా లేవు. నిర్వహణ పనులు ఆపేశారు. అనేక విభాగాలు మరమ్మతుల్లో ఉన్నాయి. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో మంగళవారం బెల్ట్ తెగిపోయింది. దానివల్ల మూడు రోజులు ఉత్పత్తి నిలిచిపోయే పరిస్థితి ఉంది.

దేదీప్యమానంగా పద్మనాభుని దీపోత్సవం

... 5వ పేజీ తరువాయి

రాలేమని భావించిన కొందరు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించేశారు.

కుంతీమాధవస్వామి ఆలయం నుంచి సాయంత్రం నాలుగు గంటల సమయంలో శ్రీదేవి, భూదేవి సమేత అనంతపద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపి తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 5.30 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం తొలి పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు మెట్లపై అప్పటికే సిద్ధం చేసుకున్న దీపాలను ఒక్కసారిగా వెలిగించారు. దీంతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానమైంది. కొండపైన, దిగువన భక్తులకు దాతలు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసులు ట్రాఫిక్ నియంత్రణతోపాటు, శాంతిభద్రతలు, ఇతర బందోబస్తు పనులు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటుచేసిన పోలీసులు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా ఉత్సవం మొత్తాన్ని పర్యవేక్షించారు. ఉత్సవానికి సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన ఎమ్మెల్యే గంటాతో కలిసి తొలి పావంచా వద్ద స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, టీడీపీ సీనియర్ నేతలు దామోదరరావు, నగేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

... 5వ పేజీ తరువాయి

దుకాణం పేరిట దందా

ఏర్పాటుకి అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగరంలో ఐదు వార్డుల్లో స్మార్ట్ వెండింగ్ జోన్‌లను తక్షణం ఏర్పాటుచేసేందుకు అవసరమైన స్థలం ఉందని, మరో 128 చోట్ల స్ట్రీట్ వెండింగ్ జోన్స్ ఏర్పాటుకు అవకాశం ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు నివేదించారు. యూసీడీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా తొలిదశలో జోన్-2 పరిధిలో ఎండాడ, జోన్-4 పరిధిలో వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు, జోన్-6 పరిధిలో గాజువాక వద్ద స్మార్ట్ వెండింగ్ జోన్‌లను ప్రారంభించేందుకు కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారుల వాటా కింద కొంత మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణం రూపంలో తీసుకుని జీవీఎంసీ కొంతమొత్తం కలిపి కంటెయినర్ దుకాణాలను ఏర్పాటుచేసి వాటికి ఫ్యాన్, సోలార్ లైటింగ్, వైఫై,తాగునీరు, వాష్‌బేసిన్ వంటి సదుపాయాలను కల్పించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా డిజైన్ రూపొందించారు.

సెంట్రల్ పార్కు వద్ద దుకాణానికి రూ.లక్ష

సెంట్రల్ పార్కు తూర్పు, పడమర, దక్షిణ దిక్కుల్లో 120 దుకాణాల ఏర్పాటుకు వీలుగా ఆర్కిటెక్చర్ డిజైన్ తయారుచేశారు. స్ట్రీట్ వెండార్లుగా పేర్లు నమోదుచేసుకున్న వారిలో అర్హులకు అక్కడ దుకాణాలు కేటాయించాలి. ఒకవేళ దుకాణాల కంటే ఆశావహులు ఎక్కువగా ఉన్నట్టయితే లాటరీ ద్వారా పారదర్శకంగా ఎంపికచేయాలి. కానీ కూటమి నేత పేరు చెబుతూ... ముగ్గురు దళారులు రంగంలోకి దిగారు. సెంట్రల్‌పార్కు వద్ద ఏర్పాటుచేసే వెండింగ్ జోన్‌లో దుకాణం ఇప్పిస్తామంటూ వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఒక్కో దుకాణం కోసం రూ.లక్ష చొప్పున వసూలుచేస్తున్నారు. రూ.లక్ష కంటే ఎక్కువమొత్తం ఇస్తామంటూ కొందరు పోటీ పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో ఫుడ్‌కోర్టు ద్వారా జీవీఎంసీకి ఒక్క రూపాయి ఆదాయం లేకపోయినా, వైసీపీ నేతలు, కూటమి నేతలు దుకాణాల నుంచి రోజువారీ వసూళ్లు చేసుకున్నారు. ఫుడ్‌కోర్టును తొలగించేందుకు అధికారులు ప్రయత్నించినా, కౌన్సిల్‌లో పలుమార్లు తీర్మానం చేసినావారే అడ్డుకున్నారు.చివరకు కమిషనర్ కేతన్‌గార్గ్ ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తలొగ్గకుండా తొలగించారు.ఈ తరుణంలో దళారులు మళ్లీ రంగప్రవేశం చేయకుండా కమిషనర్ అడ్డుకోవాలనివ్యాపారులు కోరుతున్నారు.

పెండింగ్ పనులను పూర్తిచేయండి

- జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పనులు, సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి, కొత్త పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బాలల హక్కుల కమిషన్ ఏర్పాటు చేయాలి

డాబాగార్డెన్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రైట్ టు ఎడ్యుకేషన్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. బుధవారం ఆయన రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి లేఖ రాశారు. రాష్ట్రంలో నిత్యం బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, హక్కులకు భంగం కలిగినప్పుడు కమీషన్ దృష్టికి తీసుకువచ్చి ఉపశమనం పొందే అవకాశం ఉందన్నారు.కానీ కమీషన్ లేకపోవడం వల్ల ఎవరికి చెప్పాలో తెలియక చాలామంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఉన్న కమీషన్ కాల పరిమితి ఏప్రిల్ 25తో ముగిసిందని, ఏడు నెలలు కావస్తున్నా.. కొత్త కమీషన్ ఏర్పాటు కాలేదని తెలిపారు.దీనివల్ల బాలల హక్కులకు భరోసా లేకుండా పోయిందన్నారు. తక్షణమే కమీషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

జ్ఞానాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 41వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ కోరారు. బుధవారం ఆమె జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్ఞానాపురం ఎర్రిగెడ్డలో పూడిక తొలగించాలని,సెబాస్టియన్ కాలనీలో సామాజిక భవనం నిర్మించాలని, బరల్ గ్రౌండ్‌లో రోడ్డు నిర్మించాలని, జేఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలన్నారు.

'మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దు'



సంతకాలు సేకరిస్తున్న కె.కె.రాజు, తదితరులు

మాధవధార, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న ప్రభుత్వం ఆనిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు వైసీపీ ప్రజా ఉద్యమం చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పేర్కొన్నారు. 50వ వార్డు మాధవధార బస్టాప్ వద్ద బుధవారం రచ్చబండ పేరుతో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. 50వ వార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వార్డు నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. 51వ వార్డులోని కళింగనగర్ 241, విద్యానగర్ 239 పోలింగ్ బూత్‌ల పరిధిలో కార్పొరేటర్ స్థానికులతో సంతకాల సేకరణ చేపట్టారు.

స్మార్ట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్
- సిటీ సెంట్రల్ పార్కుప్రాంతం పరిశీలన

డాబాగార్డెన్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారుల కోసం ఏర్పాటు చేయనున్న స్మార్ట్ వెండింగ్ జోన్లను అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జోన్ 4లో సెంట్రల్ పార్కుకు రోడ్డు ముఖంగా తూర్పు, పడమర, దక్షిణ భాగంలో ప్రతిపాదించిన స్మార్ట్ వెండింగ్ జోన్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్ 4లో వెండింగ్ జోన్లను బెనిఫిషియరీ కంట్రిబ్యూషన్‌తో పీపీపీ మోడ్యల్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి విక్రయదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆధునిక పద్ధతిలో ప్రజలు సౌకర్యార్థం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. జోన్లలో అవసరమైన సదుపాయాలతో ఫ్యాన్లు, లైట్లు తదితర సౌకర్యాలతో కూడిన పోర్టబుల్ కంటెయినర్లుగా ఏర్పాటు, దుకాణాలకు అవసరమైన పరికరాలు, ఉపకరణాలు నడపడానికి తగిన విధంగా ఈ ప్రాంతం మొత్తం విద్యుదీకరణ చేసి, పరిసరాలు ఆకర్షణీయంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ 4 జోన్ కమిషనర్ మల్లయ్యానాయుడు, ఆర్కిటెక్ట్ వంశీకృష్ణ, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సిటీ సెంట్రల్ పార్కు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఆక్టోపస్ సిబ్బంది

నోవాటెల్‌లో 'ఆక్టోపస్' మాక్ డ్రిల్

మహారాణిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి : ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు ఏవిధంగా ఎదుర్కొవాలన్న దానిపై నోవాటెల్‌లో ఆక్టోపస్ బృందం బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. ఆర్థిక రాజధాని అయిన నగరానికి పలువురు రాజకీయ నాయకులతో పాటు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు, వ్యాపారులు వస్తుంటారు. వారు నగరంలోని పలు స్టార్ హోటళ్లలో బస చేస్తుంటారు. ఈక్రమంలో ఉగ్రదాడి జరిగితే ఆత్మరక్షణకు ఎలా ఎదుర్కొరావాలి అన్న దానిపై నోవాటెల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. దాడి జరిగినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు, ఇతర అంశాలపై హోటల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆక్టోపస్ అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ జగ్గు నాయుడు, డీఎస్పీ బి. కృష్ణ, సీఐ పిల్లా ఉమాశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది.

పోలీసుల మాటల్లో వాస్తవం లేదు : జేవీ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

అల్లిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టుల అరెస్టు, ఎన్‌కౌంటర్లపై పోలీసులు చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవని సీపీఐ రాష్ట్ర నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. బుధవారం ఆయన అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో పౌర, ప్రజా సంఘాల వేదిక సమావేశంలో మాట్లాడారు. మావోయిస్టు నేత హిడ్మా, అతని భార్యతో పాటు ఆరుగురు మరణించారని, బుధవారం ఏడుగురు మరణించారని, 50 మందిని అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. పట్టుబడిన వారిలో కొందరిని ఎంపిక చేసి మరీ ఎన్‌కౌంటర్ చేశారని అనుమానాస్పదంగా ఉందన్నారు. అరెస్టు చేసిన వారిని చట్ట ప్రకారం 24 గంటల్లోపు కోర్టులో ప్రవేశపెట్టాలని, ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నేడు మహా రుద్రాభిషేకం

అల్లిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :అల్లిపురంలోని కెప్టెన్ రామారావు జంక్షన్ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద గురువారం సాయంత్రం మహా రుద్రాభిషేకం, కోటి దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

'ఎస్సీ కమిషన్ సభ్యుడిగా విద్యావేత్తను నియమించాలి'

మహారాణిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యుడిగా ప్రభుత్వం ప్రకటించిన ముక్కు ఆదినారాయణను తొలగించాలని అమర్‌నగర్ పూలే సేవా సంఘం డిమాండ్ చేసింది. బుధవారం వారు వన్‌టౌన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు ఎన్. రామాంజనేయులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఎంతోమంది విద్యావంతులు, మేధావులు ఉన్నారని, అటువంటి వారిని నియమిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఆదినారాయణకు కనీసం అర్హత లేదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.


జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

వార్డులో సమస్యలు పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69 వార్డు కాపు తుంగ్లాం కాలనీలో మురుగునీరు సజావుగా పోయేందుకు మార్గం ఏర్పాటు చయాలని, సరైన రహదారి సదుపాయం కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాపు తుంగ్లాంలోని సర్వే నంబరు 79, 97, 98, 100లలో ఉన్న స్థలాల మీదుగా గ్రామదేవత చింతాలమ్మ గుడికి రహదారి నిర్మించాలని కోరారు. కాపు తుంగ్లాం నుంచి చింతాలమ్మ గుడి మీదుగా షీలానగర్ 60 అడుగుల రహదారిని కలుపుతూ ప్రధాన రహదారి నిర్మించాలని కోరారు.

సామూహిక సీమంతాలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సత్య సాయిబాబా 100 జయంతి సందర్భంగా తుంగ్లాంలో ఉన్న సత్యసాయి బాబా మందిరంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. బీహెచ్‌పీవీ సత్యసాయిబాబా మందిర కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సెలర్ కాకి శ్రీదేవి పాల్గొని గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల్లో కుంకుమ పూజలు

కూర్మన్నపాలెం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడిలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీకమాసం అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో విశ్వేశ్వర దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, సామూహిక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వివిధ ఆలయాల్లో అన్నసమారాధన

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీకమాస అన్నసమారాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు 2 వేల మందికి అన్నదానం నిర్వహించారు. అలాగే కరాస దుర్గాలమ్మ, బంగారమ్మ శివాలయాల వద్ద అయ్యప్పస్వాములకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు.

సినిమా గైడ్

● **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి(మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
● **జిగ్రీస్** : జగదాంబ
● **శివ, రన్నింగ్ మాన్** : శారదా
● **దే దే ప్యార్ దే** : రమాదేవి
● **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
● **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య, లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
● **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 42, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 76, బెండకాయలు 62, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 60, బీరకాయలు 56, ఆనపకాయ 36,కాలీఫ్లవర్ 48, క్యాబేజి 28, క్యారెట్ 56, దొండకాయలు 60, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 54, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 90, గోరు చిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

చెత్త నుంచి సంపద తయారీ

» జీవీఎంసీ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నుంచి రీసైక్లింగ్ యూనిట్‌లకు రోజుకు 350 టన్నుల చెత్త తరలింపు

పెదగంట్యాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రానగర్, స్వతంత్రనగర్ కాలనీలకు సమీపంలో ఉన్న 'జీవీఎంసీ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ప్రతి రోజూ సగటున 350 టన్నుల తడి, పొడి చెత్త తో పాటు ఇతర ప్లాస్టిక్, గాజు, లోహ సంబంధిత వ్యర్థాలను సేకరిస్తోంది. వీటిని విభజించి నగర శివారునున్న పలు రీసైక్లింగ్ యూనిట్లకు ముడి సరకుగా రవాణా చేస్తున్నారు. 26వార్డుల నుంచి 147 క్లాప్ వాహనాలు ఇంటింటా చెత్తను సేకరించి ఈ యూనిట్‌కు తరలిస్తున్నాయి. కొన్ని వార్డుల్లో అయితే జీవీఎంసీకి సంబంధించిన 50 భారీ వాహనాల ద్వారా యూనిట్‌కు తీసుకువస్తున్నారు. రోజుకు సగటున 350 టన్నుల వ్యర్థాలు ఈ యూనిట్‌కు వస్తున్నాయని వే బ్రిడ్జి నిర్వాహకులు తెలిపారు. యూనిట్‌కు వచ్చిన వ్యర్థాలను అన్‌లోడ్ చేసిన వెంటనే దానిని తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్, పాలిథిన్, గాజువ్యర్థాలుగా విభజిస్తారు. తడి చెత్తను హైడ్రాలిక్ మిషన్లతో కంప్రెస్ చేసి దాన్ని కంపాక్ట్ వాహనాల ద్వారా, అలాగే పొడి చెత్తనూ కంప్రెస్ చేసి భారీ వాహనాల ద్వారా కాపులుప్పాడ డంపింగ్ యార్డులు తరలిస్తున్నారు. ప్లాస్టిక్, మెటల్ వంటి వ్యర్థాలను సేకరించి వాటిని నగర శివారుల్లో ఉన్న విద్యుత్తు, కంపోస్టు తయారీ యూనిట్లకు, ప్లాస్టిక్, మెటల్, రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తున్నారు.


చెత్తను దిగుమతి చేస్తున్న వాహనాలు

మూతపడిన కంపోస్టు తయారీ విభాగం

గతంలో ఇక్కడ కంపోస్టు తయారీ విభాగం ఉండేది. తడిచెత్తను వివిధ యంత్రాల ద్వారా కంపోస్టుగా తయారు చేసి దానిని ఎరువుగా రైతులకు విక్రయించేవారు. కంపోస్టు తయారీ వల్ల ఈ ప్రాంతంలో కాలుష్యం పెరుగుతోందని పరిసర కాలనీవాసులు ఆందోళనలు చేయడంతో ఆ విభాగాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ప్రస్తుతం ఈ యూనిట్‌కు వస్తున్న తడి చెత్త కాపులుప్పాడ డంపింగ్ యార్డులో కంపోస్టుగా తయారవుతోంది. అక్కడి నుంచే పొలాలకు, తోటలకు ఎరువుగా విక్రయిస్తున్నారు.

దుర్గామల్లేశ్వరుడికి ఎమ్మెల్యే పంచకర్ల పూజలు


హారతి తీసుకుంటున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట కృష్ణానగర్‌లో కొలువైన దుర్గామల్లేశ్వర సహిత అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం ప్రత్యేక పూజల చేశారు. అనంతనం అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన అయ్యప్పల అన్నదానం కార్యక్రమాన్ని పంచకర్ల ప్రారంభించారు. నెలన్నరగా అయ్యప్ప భక్తులకు అందజేస్తున్న ఉచిత అన్నదానం, త్వరలో నిర్మించబోతున్న అన్నపూర్ణదేవి సత్రం పునఃనిర్మాణం తదితర విషయాలను ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

షిప్‌యార్డును సందర్శించిన ఆస్ట్రేలియా బృందం


షిప్‌యార్డు సీఎండీ కార్యాలయంలో ఆస్ట్రేలియా బృదం ప్రతినిధులు

మల్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)ను న్యూఢిల్లీ, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా నుంచి 23 మంది అధికారుల నిపుణుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందానికి సీఎస్‌డీ నుంచి వైస్ అడ్మిరల్ అధిర్ ఆరోరా (రిటైర్డ్), డాక్టర్ గౌరవ్ టీబీ గౌరవ్, టీటీ గౌరవ్, సాని నాయకత్వం వహించారు. డీఎస్‌వీ ప్రాజెక్టు సహా హెచ్ఎస్ఎల్ నీటి అడుగున సామర్థ్యాలపై బృందం దృష్టి సారించింది. సంస్థ డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్) కమడోర్ రాకేష్ ప్రసాద్ ఈ బృందానికి అండర్ వాటర్ టెక్నాలజీ, మోడరన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కీలకమైన భవిష్యత్తు ప్రాజెక్టులు, షిప్‌యార్డు విస్తరణ ప్రణాళికలలో హెచ్ఎస్ఎల్ బలాల గురించి బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో షిప్‌యార్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ నాగార్జున సాగర్ కళాశాల స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ నాగార్జున సాగర్ కళాశాల స్వర్ణోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను పూర్వ విద్యార్థుల సంఘం బుధవారం ఆవిష్కరించింది. వచ్చే నెల 13, 14 తేదీల్లో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తారు. అనేక ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విశాఖలోని పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ భాస్కరరావు, బి.నిశాంత్, జి.రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొనాలకునే పూర్వ విద్యార్థులకు సహకారం కావాలంటే బి.నిశాంత్ ఫోన్ 94417 35674 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పెదగంట్యాడలో 'పెండింగ్ చలానా డ్రైవ్'


చలానా తనిఖీలు చేస్తున్న న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు

పెదగంట్యాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు బుధవారం బీసీ రోడ్డులో పెండింగ్ చలానాల డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ చలానాలు పెండింగ్ ఉన్న వాహనాలను గుర్తించి వాటికి సంబంధించిన రుసుమును మీసేవా కేంద్రాల్లో కట్టించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపండం, సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా కారు,జీపు వంటి వాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్, సిగ్నల్ జంపింగ్, ట్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ వంటి వాటికి సంబంధించిన చలానాలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఆ రుసుములను ప్రభుత్వానికి జమ చేయించారు. ఈ కార్యక్రమంలో న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర వైభవ స్వామి సేవా సమితి ఏర్పాటు

అగనంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన మహిళలు శ్రీవెంకటేశ్వర వైభవ స్వామి సేవా సమితిగా బుధవారం ఏర్పాటైయారు. ఈ సందర్భంగా మహిళలంతా పసుపు, కుంకుమ, పండ్లు, వివిధ రకాల పిండివంటకాలతో ఊరేగింపుగా వెళ్లి పైడిమాంబ ఆలయంలో పూజలు చేశారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. దేశానికి రైతే వెన్నెముక అని ప్రభుత్వాలు నమ్ముతున్నాయని అన్నారు. రైతులను ఆదుకునేందుకు వెనుకాడేదిలేదన్నారు. గాజువాక నియోజకవర్గం పరిధిలోని 466 మంది రైతులకు సంబంధించిన 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' పథకాలకు సంబంధించిన రూ.34.5 లక్షల విలువైన చెక్కును బుధవారం ఆయన విడుదల చేశారు ఈ సందర్భంగా పెదగంట్యాడ మండల కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు వేసే సమయానికి పెట్టుబడులు అందించడం, పండిన తరువాత రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పంటలను కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నారు. అతివృష్టి, అనావృష్టి, ఇతర ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు పాడైతే వాటికి బీమా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. బీమా ద్వారా వచ్చే సొమ్ముతో రైతులు తిరిగి పంటలు వేసేందుకు వెసులు బాటు కలుగుతుందన్నారు. పెదగంట్యాడ మండల తహశీల్దార్ పి.అమల అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కోనతాతారావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.


గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ

ఉమామహేశ్వరాలయంలో ఎమ్మెల్యే పల్లా పూజలు

అగనంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పెదమడక ఉమామహేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు బుధవారం లక్ష బిల్వార్చన పూజ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఎమ్మెల్యే పల్లాను సత్కరించారు. నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు గణేశ్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు బుధవారం సందర్శించారు. ఇక్కడి కేంద్రంలో విద్యార్థులు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వైటీఆర్, సీడీపీవో నీలిమ, సూపర్‌వైజర్ జ్యోతి, తదితరలు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా రేపు

మల్కాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి రిజిస్ట్రేషన్ మొదలవుతుందని తెలిపారు. ఈ జాబ్‌మేళలో 25 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పదో తరగతి ఆ పై చదివి అర్హత కలిగిన వారికి ఇంటర్వ్యూలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చే యువతకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 81217 43777, 85006 87750, 78937 87028, 79810 22453 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఇందిరాగాంధీకి నివాళి

గోపాలపట్నం నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన రచనలపై సమీక్షా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రచయిత్రి దామరాజు విశాలాక్షి, పలువురు వక్తలు సమకాలిన సామాజిక, కుటుంబ నేపథ్యంలో రచించిన రచనలపై సమీక్ష జరిపారు, ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్వీనరసింహం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన్నాన్ని అందించేవి గ్రంథాలయాలు

పెదగంట్యాడ: విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించేవి గ్రంథాలయాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖాగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉంటున్నాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారి పీవీ.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో మహిళలు విజయాలు సాధించాలి

మల్కాపురం: ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో మహిళలు అద్భుత విజయాలు సాధించవచ్చని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవ సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ క్యాస్లిన్, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి తదితరులు ప్రసంగించారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలను సత్కరించారు.

గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు

పెందుర్తి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ప్రాంగణంలో పలువురు పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


గోపాలపట్నం: ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్


జీవీఎంసీ రెవెన్యూ అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఆస్తి, ఖాళీస్థలాల పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ సమావేశమందిరంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి రెవెన్యూ విభాగం అధికారులు, జోనల్ కమిషనర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్నుల వసూళ్లతోపాటు బకాయిలు, నీటిచార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. కొన్నిజోన్ల పరిధిలో పన్నుల వసూళ్లు మందకొడిగా ఉన్నాయని, కొత్తగా ఆర్ఓలుగా నియమితులైనవారు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులతో కలిసి రోజువారీ లక్ష్యం పెట్టుకుని పన్నువసూళ్ల ద్వారా జీవీఎంసీ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. జోనల్ కమిషనర్లకు రూ.రెండు లక్షల వరకు నిధులు మంజూరుచేసే అవకాశం కల్పించామని, జెడ్సీలు దీనిని తమ జోన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించాలని ఆదేశించారు.

రోడ్డుపైనే బస్సుల పార్కింగ్

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


గాజువాక 60 అడుగుల రోడ్డుపై నిలిపివేసిన బస్సులు

గాజువాక, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గాజువాకలో ప్రధాన రహదారుల్లో బస్సులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతగాజువాక 60అడుగుల రోడ్డులో పగలు, రాత్రి అని తేడా లేకుండా పదుల సంఖ్యంలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. అంతే కాకుండా చిన్న మార్గంలో బస్సులు వేగంగా నడపడం వల్ల పలుమార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బస్సు డ్రైవర్లతో స్థానికులు, వాహనదారులు ఘర్షణలు పడుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం ఉండడంలేదని వాహనదారులు వాపోతున్నారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ప్రారంభం

వేపగుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలో ఉన్న శ్రీసత్యసాయి సేవా మందిరంలో ఈనెల 19 నుంచి 23 వరకు సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. శక్తి స్వరూపిణీ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, నారాయణ సేవ, సాయంత్రం ఓంకారం, అష్టోత్తరపూజ, శ్రీ లలితా సహస్రనామ పారాయణ, మహిళలకు వస్త్ర పంపిణీ చేశారు. ఈనెల 23న సత్యసాయి 100వ జన్మదినం సందర్భంగా మహానగర సంకీర్తన, సామూహిక వ్రతాలు, దుప్పట్ల పంపిణీ తదితర కార్యక్రమాలతో ముగింపు చేయనున్నారు.

నష్టపరిహారం చెల్లింపుపై రైతులతో సమావేశం

పెందుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టు కోసం సేకరించిన భూమికి పరిహారం నిర్ధారణ కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పెందుర్తి తహశీల్దార్ కార్యాయంలో ఆర్డీవో సనపల సుధాసాగర్, చీమలాపల్లి, పొర్లుపాలెం, చింతలగ్రహారం, లక్ష్మీపురం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆర్డీవోకు వివరించారు. ఇప్పటివరకు రైతుల అనుభవంలో ఉన్న భూములు సింహాచలం దేవస్థానానికి చెందినవని గెజిట్ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో తమకు నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు ఆలోచిస్తున్నారని రైతులు తెలిపారు. గతంలో దేవస్థానం భూములను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తే వచ్చిన నష్టపరిహారాన్ని దేవస్థానానికి, ఆయా భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులకు సమానంగా పంచారని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఇప్పుడు నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా భూసేకరణ బాధిత రైతుల సమస్యను ప్రభుత్వానికి నివేదించి, న్యాయం జరిగేలా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు కూర్మన్నపాలెం సచివాలయంలో శానిటరీ సిబ్బందికి దుప్పట్లు, నిత్యావసర సరకులు పంపిణీలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డులో జీవీఎంసీ శాని టరీ సిబ్బందికి దుప్పట్లు, నిత్యావసర సరకుల పంపిణీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం పారిశుధ్య సిబ్బంది సేవలను గుర్తించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

72వ వార్డులో..

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డులో పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ ఏజే.స్టాలిన్ కొబ్బరినూనే, సబ్బులు, భద్రతదుస్తులు, యూనిఫాం, టవల్స్‌ను బుధవారం అందజే శారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ వార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి విశేషమైందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని, పారిశుధ్య సిబ్బందికి చెత్తను వేరు చేసి ఇవ్వాలని నివాసితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దర్శనానికి సర్వం సిద్ధం

రేపటి నుంచే మార్గశిర మాసోత్సవాలు

ఆలయంలో విస్తృతస్థాయిలో ఏర్పాట్లు



మహారాణిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఆరోగ్యాన్ని, సంపదను ఇచ్చే చల్లని తల్లిగా భావించే విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

ఆలయంలో నిత్యాన్నదానం

అమ్మవారి దేవస్థానంలో భక్తులకు రోజూ నిత్య అన్నదానం చేపడతారు. కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో ఇందుకు ఏర్పాట్లు చేశారు. మార్గశిర మాసంలో భక్తులు అమ్మవారి మాలధారణ దీక్షలు చేపడతారు. అనేక మంది భక్తులు మార్గశిర దీక్ష పేరుతో ఆకు పచ్చని వస్త్రాలు ధరిస్తారు. గత దశాబ్దకాలం నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి దీక్ష పాటిస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

బురుజుపేటలో వెలసిన అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 21న ప్రారంభమై, డిసెంబరు 19 వరకు కొనసాగుతాయి. ఏటా ఈ మాసంలో దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పర్వదినాలు, అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గురువారం నాడు వేలాదిగా భక్తులు రావడం పరిపాటి. ఆలయాల వద్ద జరిగే దుస్సంఘటనలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాలతో ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 27, డిసెంబరు 4, 11, 18 తేదీలు గురువారం కావడంతో, ఆ రోజుల్లో పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దర్శనం సాఫీగా జరిగేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 20 అర్ధరాత్రి దాటాక 12.01 గంటల నుంచి 2.30 గంటల వరకు కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు జరుగుతాయి.

విశేష పూజలు

రోజూ ఉదయం 5, మధ్యాహ్నం 12, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన జరుగుతుంది. ఉదయం 8.30 నుంచి శ్రీచక్రార్చన, మహాలక్ష్మి హోమం నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఆలయ మండపంలో రోజూ మూడు పూటలా వైదిక పూజాది కార్యక్రమాలు జరుగుతాయి.

నేరుగా భక్తులు పూజలు చేసుకోవడం ఇక్కడ ప్రత్యేకత

సుమారు వందేళ్ల క్రితం విశాఖలోని బురుజుపేట చిన్నగ్రామం. అమ్మవారు గ్రామస్థుల పూజలందుకునేవారు. గర్భాలయం రోడ్డు మధ్యలో ఉండేది. నల్లరాయిని తీసుకువచ్చి గర్భాలయంగా మార్చి అమ్మవారి అభీష్టం మేరకు ఆలయ గోపురం పైకప్పు లేకుండానే నిర్మించారు. సాధారణంగా ఆలయాల్లో వేదపండితులు, అర్చకులు మూలవిరాట్‌కు పూజలు చేసి, అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించడం ఆనవాయితీ. కానీ కనకమహాలక్ష్మి అమ్మవారి మూల విరాట్‌కు భక్తులు స్వయంగా కొబ్బరి కాయ కొట్టి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించుకోవచ్చు. మొక్కులు చెల్లించుకోవచ్చు. అదే ఈ ఆలయం ప్రత్యేకత. 24 గంటలూ ఆలయం తెరిచే ఉంటుంది.

సంప్రదాయబద్ధంగా మార్గశిర మాసోత్సవాలు

» కనకమహాలక్ష్మి ఆలయ ఈవో శోభారాణి వెల్లడి



ఆలయంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఈవో కె.శోభారాణి తదితరులు

మహారాణిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను సంప్రదాయపద్ధతిలో ఘనగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె.శోభారాణి తెలిపారు. బురుజు పేటలోని అమ్మవారి ఆలయంలో ఈ నెల 21 నుంచి డిసెంబరు 19 వరకు జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు చేపడుతున్న ఏర్పాట్లపై బుధవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచనల మేరకు పలు సంస్కరణలు చేపట్టి భక్తులకు సులభ దర్శన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు క్యూలైన్ల నుంచి అమ్మవారి సేవలను ప్రత్యక్ష ప్రసారంలో చూసేలా లైవ్‌లింక్ పెడుతున్నట్లు చెప్పారు. ఆర్చ్ గేట్‌ను ముందుకు జరిపామని, ఆశీర్వచన మండపంలోనూ పలు మార్పులు చేసినట్లు వివరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు, సీసీ రోడ్లు, శానిటేషన్ పనులు చేయించామన్నారు. 21న ఉదయం 8.40 గంటలకు ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభిస్తామని, ఇందులో అధికారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో సమాచార శాఖ డీడీ సదారావు, ఆలయ ఏఈవో రాజేంద్ర కుమార్, కమిటీ సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

సీపీ పరిశీలన

కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు చేసిన ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ బాగ్చి బుధవారం సాయంత్రం పరిశీలించి, పలు సూచనలు చేశారు.



దీపం వెలిగిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా దీపోత్సవం

పద్మనాభంలో అనంత పద్మనాభుని దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భక్తజన కోలాహలం కనిపించింది. మెట్ల మార్గంలో వేల సంఖ్యలో భక్తులు దీపాలు వెలిగించి అనంత పద్మనాభునికి అంజలి ఘటించారు. కొండమార్గం పొడుగునా దేదీప్యమానంగా దీపాల వెలుగులో అనంత పద్మనాభుని కొండపై ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది.

ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం



కోలాటం ఆడుతున్న మహిళలు



పద్మనాభస్వామి దీపోత్సవంలో మెట్ల మార్గంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



వీసీ రాజశేఖర్‌కు స్వామి చిత్రపటం బహూకరణ, కప్పస్తంభం వద్ద సమాచార హక్కు చట్టం కమిషనర్ సునీల్

సింహాచలం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్, ఏయూ ఉప కులపతి డా.జీపీ రాజశేఖర్‌లు దర్శించుకున్నారు. అప్పన్న దర్శనానికి బుధవారం వచ్చిన ప్రముఖులకు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా పండప ప్రదక్షిణలు చేసి వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

డిప్యూటీ స్పీకర్ రాక రేపు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఈ నెల 21న నగరానికి రానున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ చేరుకుని దసపల్లా హోటల్‌కు వెళతారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి పిటిషన్ల కమిటీ సమావేశానికి హాజరవుతారు. అనంతరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్ వెళతారని అధికారవర్గాలు తెలిపాయి.

బెస్ట్ జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా సత్యనారాయణ



న్యూఢిల్లీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలానికి చెందిన నౌపడా సత్యనారాయణను బెస్ట్ జర్నలిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా వరల్డ్ ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. నిజాయతీతో కూడిన రిపోర్టింగ్ పట్ల సత్యనారాయణ నిబద్ధత, నైతిక జర్నలిజం పట్ల అంకితభావం, ప్రజల అవగాహన కోసం అందించిన సహకారం మీడియా కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట ప్రమాణాలను నెలకొల్పాయని వరల్డ్ ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసించింది. బుధవారం, సత్యనారాయణకు ధ్రువపత్రాన్ని అందజేసింది. కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ గతంలో పదేళ్లు తెలుగు మీడియాలో రిపోర్టర్‌గా పనిచేశారు. కేంద్ర మంత్రిగా ఎర్రన్నాయుడు ఉన్న సమయంలో ఆయన దగ్గర ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీగా కూడా సత్యనారాయణ పనిచేశారు.

ఏయూకు పూర్వ విద్యార్థుల భూరి విరాళం

ఒకరు రూ.70 లక్షలు, ఇంకొకరు రూ.20 లక్షలు ప్రకటన

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల వేళ.. పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంపై వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో రెండురోజుల కిందట నిర్వహించిన సదస్సు విజయవంతమైంది. వర్సిటీ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలు, శతాబ్ది కార్యక్రమాలపై వీసీ రాజశేఖర్ పూర్వ విద్యార్థులతో చర్చించారు. సమావేశానికి హాజరైన పలువురు వర్సిటీకి భారీగా విరాళాలతోపాటు అకడమిక్ సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన వీసీ రాజశేఖర్ శతాబ్ది వేడుకల లక్ష్యాలను వివరించారు. పూర్వ విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వీసీ కోరారు. ఈ సదస్సుకు హాజరైన రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అమెరికాలోని వియాట్రిస్‌లో గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్ అండ్ రెగ్యులేటరీ కమ్యూనికేషన్స్ హెడ్‌గా పని చేస్తున్న డాక్టర్ దేవా హెచ్ పురాణం రూ.70 లక్షల విరాళం ప్రకటించారు. క్యాంపస్ సుందరీకరణకు రూ.50 లక్షలు, అధునాతన పరిశోధనలను ప్రోత్సహించేందుకు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ల స్థాపనకు మరో రూ.20 లక్షలు అందించనున్నట్టు ప్రకటించారు. అలాగే, ఐఐటీ భువనేశ్వర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వీ రాజ్‌కుమార్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘానికి రూ.7.5 లక్షల విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఏర్పాటు చేయాలని సూచించారు. కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గిరిజా శంకర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాల సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కీలక స్థానాల్లో ఉన్న పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశమైన ఏయూ పూర్వ విద్యార్థులు

క్రైం... crime news

వ్యక్తిపై కర్రతో దాడి.. చికిత్స పొందుతూ మృతి



మృతిచెందిన చిరంజీవి

సీతంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డైమండ్ పార్కు సమీపంలో ఓ వ్యక్తి తలపై మరొకరు కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ ఉమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. డైమండ్ పార్కు సమీపంలో దాడి చిరంజీవి, లక్ష్మారెడ్డి, చిరంజీవి స్నేహితుడు హేమంత్‌లు భిక్షాటనతో భోజనం పొట్లాలు తెచ్చుకుని ఫుట్‌పాత్‌లపైన, పార్కులో తింటుంటారు. బుధవారం మధ్యాహ్నం డైమండ్ పార్కులో కూర్చుని భోజనం చేశారు. అనంతరం చిరంజీవి పార్కులో పడుకొని ఉన్నాడు. అయితే లక్ష్మారెడ్డికి, చిరంజీవికి అంతకుముందే చిన్న గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో పార్కులో పడుకున్న చిరంజీవిని లక్ష్మారెడ్డి కర్రతో తలపై గట్టిగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన చిరంజీవిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చిరంజీవి సాయంత్రం మృతి చెందాడు. నాలుగో పట్టణ సీఐ ఉమాకాంత్ తన సిబ్బందితో వెళ్లి విచారించి లక్ష్మారెడ్డిపై హత్య కేసు నమోదు చేశారు. అనంతరం అతడిని అదుపులో తీసుకున్నారు. మృతి చెందిన వ్యక్తిపై గతంలో మూడు కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

ఆనందపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శొంఠ్యాం సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందినట్లు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. ముచ్చర్ల గ్రామానికి చెందిన షిణగం లక్ష్మి (52) పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేది. బుధవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన అప్పలరాజు ఆటోలో ఆనందపురానికి పూల కొనుగోలుకు వచ్చారు. కొనుగోలు చేసిన అనంతరం అదే ఆటోలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళ్తుండగా శొంఠ్యాం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా రోడ్డు మధ్యలో నిలుపుదల చేసిన లారీని ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మికి బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆటో డ్రైవర్ అప్పలరాజుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం విశాఖలోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త సన్యాసిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రిప్టోకరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకి అందిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎండాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్, క్రిప్టో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, టాస్క్‌బేస్ట్ పార్ట్‌టైం జాబ్స్, వాట్సాప్ ఇంప్రోసొనేషన్ స్కామ్ బాధితుల నుంచి సైబర్ మోసం ద్వారా కొల్లగొట్టిన డబ్బులను మ్యూల్ అకౌంట్లతో విత్ డ్రా చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు క్రిప్టో కరెన్సీగా మార్చి అందించిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు.

నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఒక నెంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. స్నేహితుడినంటూ నమ్మించి ప్రస్తుతం డబ్బులు అవసరమని చెప్పి మూడు అకౌంట్లలోకి కోటి రూపాయల వరకు బదిలీ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించి నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. వారు సమగ్రంగా దర్యాప్తు చేయగా తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలానికి చెందిన లక్కుల మనోజ్ అకౌంట్ల నుంచి క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకి అందించినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

పరారీలో ఉన్న ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్

గోపాలపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలింపు కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల్ని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హుకుంపేటకు చెందిన గుంట కార్తిక్, కొరాపుట్‌కు చెందిన బాబుల కొర్ర అనే ఇద్దరు గంజాయి తరలింపు కేసులో నిందితులు. వీరు రెండు నెలలుగా పరారీలో ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు గోపాలపట్నం పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలించి జోలాపుట్, హుకుంపేట పరిసర ప్రాంతాల్లో పట్టుకున్నారు.

ఐదుగురి జీవితాలకు వెలుగు

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం



రమేష్ (ఫైల్ ఫొటో)

ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాను మరణించి కూడా ఓ వ్యక్తి ఐదుగురికి కొత్త జీవితాలు ప్రసాదించారు. ఎండాడకు చెందిన బొబ్బిలి రమేష్ (51) తన ఇద్దరు పిల్లలు, భార్యతో ఎండాడలో నివాసం ఉండేవారు. ఆయన ఆటో డ్రైవర్‌గా పనిచేసేవారు. తాను నివాసం ఉంటున్న మేడ పైనుంచి ఈ నెల 10న ప్రమాదవశాత్తు కిందకు పడిపోయారు. దీనితో అతని తలలో తీవ్ర రక్తస్రావం జరిగింది. ఆయనకు మెరుగైన చికిత్స నిమిత్తం వెంకోజీ పాలెంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. అతనిని కాపాడేందుకు వైద్య బృందం తీవ్ర ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం బ్రెయిన్ డెడ్‌గా వైద్య బృందం ప్రకటించింది. ఆ వెంటనే రమేష్ కుటుంబం, బంధువులకు అవయవదానం గురించి అవగాహన కల్పించడంతో వారు సుముఖత తెలిపారు. జీవనదాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన అనుమతులు జారీ చేశారు. బ్రెయిన్ డెడ్ అయిన రమేష్ నుంచి కాలేయం, మూత్రపిండాలు, కార్నియా స్వీకరించారు. జీవనదాన్ ప్రోటోకాల్ మేరకు సీనియారిటీ జాబితా ప్రకారం అవయవాలను పలు ఆసుపత్రులకు కేటాయించారు. ఇతరుల జీవితాలలో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతుడి కుటంబసభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులను డాక్టర్ రాంబాబు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్‌వికాస్ యోజన కార్యక్రమంలోభాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ (డ్రైవింగ్‌స్కూల్) ఏర్పాటుకు ఔత్సాహికులు గురువారం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా రవాణా శాఖ ఉపకమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ప్రోత్సహించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రతీ పది లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అవకాశం కల్పించారన్నారు. ట్రస్ట్, ఎన్‌జీవో, కో-ఆపరేటివ్ సొసైటీ కలిగిన వారు ఆసక్తి చూపితే డ్రాఫ్ట్(డీపీఆర్) జెరాక్స్, కనీసం పదేళ్లపాటు లీజు కలిగిన రెండెకరాల భూమి, సిమ్యూలేటర్, శిక్షణకు వాహనాలు, వర్క్‌షాప్, క్లాస్ రూమ్, ఇంటర్నెట్ సదుపాయం ఉండాలన్నారు. మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టర్నోవర్ సర్టిఫికేట్, ఇతర ధ్రువపత్రాలను రవాణా శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ పరిశీలన తర్వాత శిక్షణ కేంద్రం మంజూరుపై నిర్ణయం తీసుకుంటారన్నారు. సందేహాలు ఉంటే 92816 07042 నంబర్‌లో సంప్రదించాలని ఇన్‌ఛార్జి డీటీసీ కోరారు.

ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరక్టర్‌గా ఎస్.హరిబాబు



విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఈపీడీసీఎల్) ఫైనాన్స్ డైరక్టర్‌గా చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.హరిబాబుకు బుధవారం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 15 వరకు ఫైనాన్స్ డైరక్టర్‌గా డి.చంద్రం విధులు నిర్వర్తించారు. ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీసులకు చెందిన ఆయన డిప్యూటేషన్‌పై ఈపీడీసీఎల్‌కు వచ్చారు. పదవీ కాలం పూర్తి కావడంతో వెనక్కి వెళ్లిపోయారు. దాంతో హరిబాబుకు బాధ్యతలు ఇచ్చారు.